


# సాయి సూర్య

తెలుగు దిన పత్రిక

www.saisuryaa.com




ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 68 ఎడిటర్ : పొలగోని రాజేష్ పేజిలు : 8, వెల రూ. 4, /- బుధవారం - 28 - మే - 2025

## ప్రపంచానికి 'సిందూర్' ప్రాముఖ్యత తెలిసింది: అమిత్ షా


2

ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి భారతీయ సిందూరం ప్రాముఖ్యతను చాటామన్న అమిత్ షా

పాక్ ఉగ్రస్థావరాలపై దాడులతో దేశం గర్వపడేలా చేశామని వ్యాఖ్య

మోదీ వల్లే ఇది సాధ్యమైందని, శాంతికి భంగం కలిగించేవారు బాధతో మూలుగుతున్నారని వెల్లడి

## భారతీయ విద్యార్థులకు అమెరికా ఎంబసీ హెచ్చరిక



అమెరికాలో అంతర్జాతీయ విద్యార్థులకు స్టూడెంట్ వీసా నిబంధనలపై ప్రభుత్వం హెచ్చరిక

క్లాసులకు వెళ్లకపోయినా, కాలేజీకి చెప్పకుండా కోర్సు మానేసినా వీసా రద్దు

భవిష్యత్తులో అమెరికా వీసాలు పొందే అర్హత కోల్పోయే ప్రమాదం

## భారత్ తో చర్చలకు మేం సిద్ధం.. పాక్ ప్రధాని ప్రతిపాదన



2లో

ఇరాన్ అధ్యక్షుడితో సమావేశం అనంతరం షరీఫ్ ప్రకటన

కశ్మీర్ సహా అన్ని అంశాలపై చర్చలు జరపాలని డిమాండ్

ఉగ్రవాదం, పీవోకేపై మాత్రమే చర్చలని స్పష్టం చేసిన భారత్

## హైదరాబాద్ ఐటీ కారిడార్లో ట్రాఫిక్ కష్టాలకు చెల్లుచీటీ! త్వరలో కొండాపూర్ కొత్త ఫ్లైఓవర్ ప్రారంభం


2

- చివరి దశకు కొండాపూర్ మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ నిర్మాణం
- జూన్ తొలి వారంలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొండాపూర్‌కు మెరుగైన రవాణా సౌకర్యం
- గచ్చిబౌలి జంక్షన్ వద్ద భారీగా తగ్గనున్న ట్రాఫిక్ జామ్

# డాలస్‌లో తెలంగాణ ఆవిర్భావ బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు

- అమెరికా, లండన్ పర్యటనకు బయల్దేరిన కేటీఆర్
- లండన్‌లో 'ఇండియా వీక్ 2025'లో కేటీఆర్ కీలక ప్రసంగం
- వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులతో కేటీఆర్ సమావేశాలు



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లండన్, అమెరికా పర్యటనకు బయల్దేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ముఖ్యంగా అమెరికా లోని డాలస్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు, బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాల్లో కూడా కేటీఆర్ పాల్గొంటారు. కేటీఆర్ తన పర్యటనలో భాగంగా మొదట యూకే వెళ్లనున్నారు. ఈ నెల 30న లండన్‌లో బ్రిడ్జ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే ప్రతిష్ఠాత్మక "ఇండియా వీక్ 2025" సదస్సులో మిగతా..2లో

## పాకిస్థాన్ పరువు తీసేసిన అసదుద్దీన్ ఒవైసీ..



ప్రధాని షరీఫ్, ఆర్మీ చీఫ్ లను స్టుపిడ్ జోకర్లు అంటూ మండిపడ్డ ఒవైసీ

కనీసం కాపీ కొట్టడం కూడా రాని దద్దమ్మలంటూ ఎద్దేవా

షరీఫ్ కు పాక్ ఆర్మీ చీఫ్ బహుకరించిన ఫొటోపై విమర్శలు

2019లో చైనా సైనిక విన్యాసాల ఫొటోను ఉపయోగించారని వెల్లడి

కువైట్‌లో భారతీయ సమాజంతో మాట్లాడుతూ ఒవైసీ వ్యాఖ్యలు

హైదరాబాద్ : అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ కుటిల నీతిని ఎండగట్టేందుకు భారత ఎంపీల బృందాలు విదేశాల్లో పర్యటిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా కువైట్ లో పర్యటిస్తున్న ఎంపీల బృందంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం కువైట్ లోని భారత సంతతి పౌరులను మిగతా..2లో



## 'మీరే చెప్పండి.. ఇది అచ్చేదిన్ కాదా?'

హైదరాబాద్:ప్రధాని నరేంద్ర మోదీ పదకొండేళ్ల పాలనపై ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గే విషం చిమ్ముతున్నారరంటూ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ధ్వజమెత్తారు. మోదీ తన పాలనలో చేసిన అభివృద్ధి మీకు కనిపించడం లేదా ఖర్గే జీ.. అంటూ లక్ష్మణ్ ప్రశ్నిం?చారు. మిగతా..2లో

## మేడిగడ్డ బ్యారేజీ రిపోర్టుపై ఎల్ అండ్ టీ సంచలన లేఖ


2


## ఖైరతాబాద్ గణేశ్: 71వ ఏడాది ఉత్సవాలకు ఏర్పాట్లు షురూ!

ఖైరతాబాద్ మహాగణపతి 2025 పనులకు జూన్ 6న శ్రీకారం

నిర్జల ఏకాదశి నాడు కర్రపూజతో విగ్రహ తయారీ ప్రారంభం

గతేడాది 70 అడుగుల మట్టి విగ్రహంతో దర్శనమిచ్చిన గణపయ్య

ఈసారి విగ్రహం ఎత్తుపై నగరవాసుల్లో ఆసక్తి


2

## థియేటర్ల బంద్ వెనుక శక్తులపై విచారణకు ఆదేశించిన పవన్ కల్యాణ్

- జనసేన నేతలున్నా చర్యలు తప్పవన్న పవన్ కల్యాణ్
- టికెట్ ధరల గురించి ఫిల్మ్ ఛాంబర్ ద్వారానే రావాలని స్పష్టీకరణ
- తన సినిమాకు కూడా ఇదే వర్తిస్తుందన్న డిప్యూటీ సీఎం



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో సినిమా హాళ్ల నిర్వహణను పటిష్టంగా చేపట్టి, ప్రేక్షకులకు నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పవన్ తో సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల మిగతా..2లో

## కొడాలి నానిని చూసేందుకు ఎవరూ రావద్దు: నాని కుటుంబ సభ్యులు


2

శస్త్ర చికిత్స తర్వాత హైదరాబాద్ లోని నివాసంలో ఉంటున్న కొడాలి నాని

ఇటీవల ఓ వివాహ రిసెప్షన్ కు హాజరైన నాని

నాని కోలుకున్నారనే భావనతో ఆయనను కలిసేందుకు సిద్ధమవుతున్న వైసీపీ శ్రేణులు

## ఉగ్రదాడులతో భారత్‌లో అశాంతి సృష్టిస్తే మౌనంగా ఉండబోమని ప్రధాని మోదీ

- పాకిస్థాన్‌ను హెచ్చరిస్తూనే.. సర్దార్ పటేల్‌ను గుర్తు చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ
- సర్దార్ పటేల్ మాట విని ఉంటే 76 ఏళ్లుగా ఉగ్రదాడులు ఉండేవి కాదన్న ప్రధాని
- పాక్‌లో ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారని ఆరోపణ
- శాంతిని కోరుకుంటాం, కానీ పరోక్ష యుద్ధంతో వస్తే సహించబోమని స్పష్టీకరణ



అమరావతి : దేశంలో ఉగ్రవాద దాడుల ద్వారా అశాంతి సృష్టించాలని చూస్తే సహించేది లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్థాన్‌ను హెచ్చరించారు. దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సూచనలను నాటి పాలకులు పెడచెవిన పెట్టడం మిగతా..2లో

# కార్యకర్తలే మా అధినేతలు వారే మా ప్రాణం...

- మహానాడు తొలిరోజు చంద్రబాబు ప్రసంగం హైలైట్స్!
- కడపలో ప్రారంభమైన టీడీపీ మహానాడు, తొలిరోజు ప్రసంగించిన చంద్రబాబు
- పార్టీకి కార్యకర్తలే అసలైన యజమానులని ఉద్ఘాటన
- వారి త్యాగాలను వృథా పోనివ్వమని, అండగా ఉంటామని భరోసా
- సంక్షేమం, అభివృద్ధిలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని వెల్లడి
- రాబోయే ఎన్నికల్లో కడప జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలు గెలవాలని పిలుపు
- గత ప్రభుత్వ పాలనపై విమర్శలు, భవిష్యత్ ప్రణాళికల వెల్లడి



అమరావతి : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే నిజమైన అధినేతలని, పార్టీకి ప్రాణశక్తితో పాటు ఆయుధం కూడా వారేనని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంగళవారం కడపలో ప్రారంభమైన మహానాడు తొలిరోజు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం, పహల్గాం దుర్ఘటన మృతులకు, ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన సైనికులకు, అలాగే పార్టీలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా కడప గడ్డపై దీనిని నిర్వహించడం ఆనందంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే తన మనసు ఉప్పొంగుతోందని, మిగతా..2లో

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక



# కార్యకర్తలే మా అధినేతలు వారే మా ప్రాణం...

మొదటి పేజి తరువాయి



కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే తన మనసు ఉప్పొంగుతోందని, వారి త్యాగాలను ఎప్పటికీ వృథా కానివ్వమని, వారికి అన్ని విధాలా అండగా నిలబడి సంక్షేమం అందిస్తామని హామీ ఇచ్చారు.

కార్యకర్తల పోరాటమే అద్భుత విజయానికి కారణం

2024 ఎన్నికల్లో పార్టీ సాధించిన అసాధారణ విజయం కార్యకర్తల పోరాట పటిమ, త్యాగాల వల్లే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు. 93 శాతం స్ట్రైక్ రేట్‌తో, 57 శాతం ఓట్ల వాటాతో చరిత్ర సృష్టించామంటే దానికి పసుపు సైనికులే కారణమని కొనియాడారు. జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేయడం కూడా ఈ భారీ విజయానికి దోహదపడిందని తెలిపారు. దశాబ్దాలుగా పార్టీ జెండాను మోస్తున్న కార్యకర్తల వల్లే తాము ఈ స్థాయిలో ఉన్నామని, ఈ విషయాన్ని ప్రతి నాయకుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. "43 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలను మనం ఎదుర్కొన్నాం. పార్టీ పని అయిపోయిందన్న వారి పనే అయిపోయింది కానీ, టీడీపీ జెండా రెపరెపలాడుతూనే ఉంది," అని చంద్రబాబు ఉద్వేగంగా అన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిని ప్రశ్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను వేధించారని, అయినా ఎవరూ జెండా దించలేదని గుర్తుచేశారు. "మన పసుపు సింహం చంద్రయ్య గొంతు కోస్తున్నా జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలారు. అలాంటి ఎందరో కార్యకర్తల త్యాగాల వల్లే కూటమి అధికారంలోకి వచ్చింది. మీ త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను," అని చంద్రబాబు తెలిపారు.

పాలనలో టీడీపీనే ట్రెండ్ సెట్టర్

సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలనలో తెలుగుదేశం పార్టీయే ట్రెండ్ సెట్టర్ అని చంద్రబాబు అన్నారు. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు నుంచి మహిళలకు ఆస్తిహక్కు వరకు, రూ.2కే కిలో బియ్యం నుంచి పక్కా ఇళ్ల వరకు, రూ.30 పింఛన్ నుంచి నేటి రూ.4000 పింఛన్ వరకు అనేక కార్యక్రమాలకు టీడీపీనే శ్రీకారం చుట్టిందని వివరించారు. దీపం పథకం, డ్వాక్రా సంఘాల సాధికారత, ఐటీ ఉద్యోగాల కల్పన, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడం వంటివి టీడీపీ ఘనతలేనని పేర్కొన్నారు. "ఒక వర్గం, ఒక ప్రాంతం అని కాదు, ఏ అంశమైనా పసుపు జెండా పుట్టకముందు, పుట్టిన తర్వాత అని గీత గీసి చెప్పే పరిస్థితి ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. 45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి ఒక ప్రాంతీయ పార్టీగా రికార్డు సృష్టించామని గుర్తుచేశారు.

అవినీతిపై రాజీలేని పోరాటం, భవిష్యత్ ప్రణాళికలు

తాను నిత్య విద్యార్థినని, ప్రతిరోజూ నేర్చుకుని ప్రజలకు సేవ చేస్తానని చంద్రబాబు తెలిపారు. అవినీతిపై టీడీపీ మొదటి నుంచీ రాజీలేని పోరాటం చేసిందని, ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం నుంచి నిన్నటి విధ్వంస పాలన వరకు ఇది కొనసాగిందని అన్నారు. ఓబుళాపురం అక్రమ మైనింగ్‌పై తాము చేసిన ఉద్యమం ఫలితాలు నేడు కనిపిస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వ అవినీతిపై విచారణకు ఆదేశాలిచ్చామని, దోచుకున్న సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పోలవరం పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరిస్తామని, గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. "ఆ రోజు నేను హైటెక్ సిటీ నిర్మించి హైదరాబాద్‌లో ఐటీ తెచ్చాను. ఈ మహానాడు ద్వారా క్వాంటమ్ వ్యాలీ, ఏఐకి ప్రాధాన్యత ఇచ్చి తెలుగుజాతిని ముందుకు నడిపిస్తాను" అని ప్రకటించారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన, ప్రతి ఒక్కరి ఆదాయం రూ.55 లక్షలకు పెంచడం, జీరో పావర్టీ సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

సంక్షేమ పథకాలు, పెట్టుబడులు

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చంద్రబాబు తెలిపారు. 64 లక్షల మందికి రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందిస్తున్నామని, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభించామని, దీపం పథకం ద్వారా కోటి మందికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామని ప్రకటించారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలో తల్లికి వందనం అందిస్తామని తెలిపారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, 11 నెలల్లో 76 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపి రూ.4 లక్షల 96 వేల కోట్ల పెట్టుబడులు, 4 లక్షల 57 వేల ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు. పెద్ద నోట్లు రద్దు చేస్తేనే దేశంలో అవినీతి పోతుందని, తాను ఈ మేరకు ప్రధానికి నివేదిక ఇచ్చానని గుర్తుచేశారు.

సీమ అభివృద్ధి, పార్టీ బలోపేతం

రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చింది టీడీపీయేనని, తెలుగుగంగ, కేసీ కెనాల్, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు పూర్తిచేశామని చంద్రబాబు అన్నారు. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లులను పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పార్టీలో కింది స్థాయి నుంచి నాయకత్వాన్ని బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, పార్టీకి అనుసంధానం పెరగాలని, దానికి ఈ మహానాడు వేదిక కావాలని ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో కడప జిల్లాలో 10కి 10 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను, తెలుగుజాతిని దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపే వరకు నిరంతరం పనిచేస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు.

## కొడాలి నానిని చూసేందుకు ఎవరూ రావద్దు: నాని కుటుంబ సభ్యులు

అమరావతి : మాజీ మంత్రి కొడాలి నానికి ఇటీవల శస్త్రచికిత్స జరిగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని నివాసంలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, ఆయనను పరామర్శించేందుకు గుడివాడ నియోజకవర్గం నుంచి గానీ, ఇతర ప్రాంతాల నుంచి గానీ అభిమానులు, వైసీపీ శ్రేణులు హైదరాబాద్ రావద్దని ఆయన కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వైసీపీ నేత దుక్కిపాటి శశిభూషణ్ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. శస్త్రచికిత్స అనంతరం కొడాలి నానికి ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని, ఎక్కువ మంది వ్యక్తులను కలిస్తే ఆయన ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు సూచించినట్లు శశిభూషణ్ తెలిపారు. ముఖ్యంగా కొవిడ్ పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఇటీవల కొడాలి నాని తప్పనిసరి పరిస్థితుల్లో ఓ సన్నిహిత మిత్రుడి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారని, ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన ఆరోగ్యం కుదుటపడిందని కొందరు భావిస్తున్నారని... ఈ క్రమంలోనే పలువురు ఆయనను పరామర్శించేందుకు హైదరాబాద్ వస్తున్నట్లు తెలిసిందని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇది శ్రేయస్కరం కాదని అన్నారు. మరో రెండు నెలల్లో కొడాలి నాని పూర్తి ఆరోగ్యంతో అందరికీ అందుబాటులోకి వస్తారని శశిభూషణ్ స్పష్టం చేశారు. అప్పటివరకు అందరూ సహకరించాలని కోరారు. కాగా, కొడాలి నాని తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో ప్రాథమిక చికిత్స తీసుకున్న అనంతరం, మెరుగైన వైద్యం కోసం ముంబై వెళ్లిన విషయం తెలిసిందే. ముంబైలో ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించారు.

## థియేటర్ల బంద్ వెనుక శక్తులపై విచారణకు ఆదేశించిన పవన్ కల్యాణ్

మొదటి పేజి తరువాయి




పవన్ తో సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమావేశమయ్యారు. సినిమా హాళ్ల బంద్ ప్రకటన, ఆ తర్వాత శాఖాపరంగా తీసుకున్న చర్యల గురించి పవన్ కు దుర్గేశ్ వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. కొత్త సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు వ్యక్తిగతంగా కాకుండా, తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి (ఫిల్మ్ ఛాంబర్) ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించేలా పటిష్టమైన విధానాన్ని అమలు చేయాలని పవన్ స్పష్టం చేశారు. త్వరలో విడుదల కానున్న తన చిత్రం 'హరిహర వీరమల్లు'కు కూడా ఇదే నిబంధన వర్తిస్తుందని, నిర్మాత నేరుగా కాకుండా ఫిల్మ్ ఛాంబర్ ద్వారానే ధరల పెంపు ప్రతిపాదనలు పంపాలని తేల్చిచెప్పారు. టికెట్ ధరలు, సినిమా హాళ్ల నిర్వహణ వంటి ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను కచ్చితంగా నిర్వర్తించాలని సూచించారు. సినిమా హాళ్లలో టికెట్ ధరలతో పాటు తినుబండారాలు, శీతల పానీయాలు, చివరికి వాటర్ బాటిల్ ధరలు కూడా అధికంగా ఉండటంపై సమావేశంలో చర్చ జరిగింది. వీటి వాస్తవ ధరలు, విక్రయ ధరలు, నాణ్యతా ప్రమాణాలపై సంబంధిత శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ జరిపి, ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు. మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్లలో ఆహార పదార్థాల వ్యాపారంలో గుత్తాధిపత్యం నడుస్తోందన్న విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి దుర్గేశ్ కు సూచించారు. తినుబండారాల ధరలు అందుబాటులో ఉంటేనే ప్రేక్షకులు కుటుంబాలతో సినిమాకు వస్తారని, తద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం కూడా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై పన్నుల శాఖతో సమీక్షించాలని తెలిపారు. సినిమా హాళ్ల బంద్ ప్రకటన వెనుక ఉన్న కారణాలు, కొందరు వ్యక్తుల ప్రమేయం, ఇద్దరు నిర్మాతలు తమకు సంబంధం లేదని ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లా నుంచే బంద్ ప్రకటన రావడం వంటి అంశాలపై చర్చించారు. బంద్ వెనుక ఒక నిర్మాత, థియేటర్లు కలిగిన రాజకీయ నాయకుడి ప్రమేయం ఉందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ కోణంలో కూడా దర్యాప్తు చేయాలని పవన్ సూచించారు. "ఈ బంద్ ప్రకటన వెనుక ఎవరున్నా, వారు జనసేన పార్టీకి చెందినవారైనా సరే, కఠిన చర్యలు తీసుకోవాలి. బెదిరింపులతో వ్యాపారాలు చేసే అనారోగ్యకర వాతావరణాన్ని సహించవద్దు" అని స్పష్టం చేశారు. సినిమా వ్యాపారం సజావుగా సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి, ఇతర సినీ సంఘాలకు తెలియజేయాలని ఆదేశించారు. అలాగే, ప్రభుత్వం తీసుకురానున్న సమగ్ర సినిమా అభివృద్ధి పాలసీ కోసం సినీ పరిశ్రమలోని అన్ని వర్గాల నుంచి సూచనలు స్వీకరించాలని చెప్పారు.

## 'మీరే చెప్పండి.. ఇది అచ్చేదిన్ కాదా?'



హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ పదకొండేళ్ల పాలనపై ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గే విషం చిమ్ముతున్నారరంటూ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ధ్వజమెత్తారు. మోదీ తన పాలనలో చేసిన అభివృద్ధి మీకు కనిపించడం లేదా ఖర్గే జీ.. అంటూ లక్ష్మణ్ ప్రశ్నిం?చారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి మీడియా సమావేశం నిర్వహించారు లక్ష్మణ్, 'మోదీ పదకొండు ఏళ్ల పాలనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే విషం చిమ్ముతున్నారు. ప్రపంచంలో పదవ స్థానంలో ఉన్న భారత్ ను మోదీ నాలుగవ ఆర్థిక శక్తిగా ఎదిగేలా చేశారు. మోదీ విధానాలు, కులం, వస్త్రాలపై రాహుల్ గాంధీ అవహేళన చేశారు. స్టాండప్, స్టార్టప్, మేక్ ఇన్ ఇండియాగా మోదీ తీర్చిదిద్దారు. ఉద్యోగాలు ఇవ్వడమే కాదు.. ఉద్యోగాలు కల్పించే వ్యవస్థలుగా యువతను తీర్చిదిద్దారు. జాతీయ రహదారులు, రైల్వే, వైమానిక రంగాలను అభివృద్ధి చేశారు. కాంగ్రెస్ పాలన కన్నా వంద రెట్ల అభివృద్ధి మోదీ చేసి చూపించారు. నకిలీ విత్తనాలు అరికట్టి, కనీస మద్దతు ధరలు, సబ్సిడీలు మోదీ ప్రభుత్వం కల్పించింది. ఇది అచ్చేదిన్ కాదా ఖర్గే చెప్పాలి. ఓబీసీలపైన రాహుల్ గాంధీ మొసలి కన్నీరు కారుస్తున్నారు. మోదీ గ్లోబల్ లీడర్ గా ఎదిగారు.. ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయి. కాంగ్రెస్ హయాంలో మోదీ తరహాలో పాకిస్తాన్ కు బుద్ధి చెప్పారా?, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ దేశ రక్షణ రంగ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. మల్లిఖార్జున్ ఖర్గే వాస్తవాలు గ్రహించాలి. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయింది. ముఖ్యమంత్రి ఢిల్లీలో మూడు రోజులు పడిగాపులు కాశారు. రాహుల్ గాంధీ ముఖ్యమంత్రికి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే. కుటుంబ కలహాలు, ఆస్తుల పంపకాలు, వారసత్వ రాజకీయాల వల్లే బీఆర్ఎస్ లో కొట్లాట. బీజేపీ వెన్నుపోటు రాజకీయాలు చేయదు. ఆయుధాలు చేతిలో పట్టుకొని చర్చలు అంటే ఎట్లా?, ఆపరేషన్ సిందూర్ ను విమర్శిస్తే ప్రజలే గుణపాఠం చెబుతారు' అని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

## డాలస్‌లో తెలంగాణ ఆవిర్భావ బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు

మొదటి పేజి తరువాయి

"ఇండియా వీక్ 2025" సదస్సులో ఆయన ప్రధాన ఉపన్యాసం చేయనున్నారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. ఈ వేదికపై కేటీఆర్, బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ సాధించిన అభివృద్ధి, వినూత్న ఆవిష్కరణల గురించి వివరించనున్నారు. తెలంగాణ విజయ ప్రస్థానాన్ని, అభివృద్ధి నమూనాని అంతర్జాతీయ సమాజానికి తెలియజేయనున్నారు. అదే రోజు వార్విక్‌లో, మొబిలిటీ టెక్నాలజీ రంగంలో తెలంగాణకు చెందిన ఆవిష్కరణలకు నిదర్శనంగా నిలిచిన ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ నాలెడ్జ్ సెంటర్‌ను కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఈ కేంద్రం మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి ప్రపంచ ప్రఖ్యాత ఆటోమోటివ్ సంస్థలకు పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ డీ) సేవలను అందించనుంది. ఇందులో అత్యాధునిక నీర్ షోర్ హార్డ్‌వేర్-ఇన్-లూప్ టెస్ట్ సెంటర్ కూడా ఉంది. యూకే పర్యటన ముగించుకున్న అనంతరం కేటీఆర్ అమెరికా వెళ్తారు. అక్కడ తెలంగాణ ఎన్ఆర్ఐలు నిర్వహించే పలు ముఖ్యమైన కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు. జూన్ 1న టెక్సాస్ రాష్ట్రంలోని ఫ్రిస్కో నగరంలో ఉన్న కొమెరికా సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్ల రజతోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ భారీ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన వేలాది మంది ప్రవాస భారతీయులు పాల్గొంటారని అంచనా. జూన్ 2న కేటీఆర్, డాలస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (యూటీ డాలస్)లో భారతీయ విద్యార్థులతో సమావేశమవుతారు. తన ప్రసంగాలు, పనితీరుతో యువతకు స్ఫూర్తిగా నిలిచే కేటీఆర్, ఈ సందర్భంగా నూతన ఆవిష్కరణలు, ఎంట్రప్రెన్యూర్‌షిప్‌తో పాటు భవిష్యత్ భారత నిర్మాణంలో విద్యార్థుల పాత్ర గురించి ప్రసంగించనున్నారు. ఈ పర్యటనలో కేటీఆర్ వివిధ దేశాల మేధావులు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులతో సమావేశమై తెలంగాణ ప్రగతిని, ఇక్కడి అవకాశాలను వివరించనున్నారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్, పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రఘువీర్ సింగ్ తదితరులు హైదరాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరారు. కేటీఆర్ యూకే, యూఎస్ పర్యటన పట్ల అక్కడి ఎన్ఆర్ఐలు, వ్యాపారవేత్తలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## పాకిస్థాన్ పరువు తీసేసిన అసదుద్దీన్ ఒవైసీ..

మొదటి పేజి తరువాయి


ఈ నేపథ్యంలోనే సోమవారం కువైట్ లోని భారత సంతతి పౌరులను ఉద్దేశించి అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. ఈ సమావేశంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ లపై ఒవైసీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కనీసం కాపీ కొట్టడం కూడా రాని దద్దమ్మలంటూ ఎద్దేవా చేశారు. భారత్‌కు వ్యతిరేకంగా జరిగిన సైనిక చర్యకు సంబంధించి తప్పుడు జ్ఞాపికను ప్రదర్శించడంపై ఆయన మండిపడ్డారు. వారిని "తెలివి తక్కువ జోకర్లు" (స్టుపిడ్ జోకర్స్) అంటూ ఘాటుగా విమర్శించారు. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'కు ప్రతిగా తాము 'ఆపరేషన్ బున్యాన్-ఉన్-మర్సూస్' నిర్వహించామని, అందులో విజయం సాధించామని చాటుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇటీవల జరిగిన ఓ ఉన్నతస్థాయి కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఓ జ్ఞాపికను అందజేశారు. అయితే, ఆ జ్ఞాపికలో ఉన్న పెయింటింగ్, చైనా సైనిక విన్యాసాలకు సంబంధించినదని ఆరోపణలు వచ్చాయి. ఈ కార్యక్రమానికి పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరైనట్లు సమాచారం. అసదుద్దీన్ ఒవైసీ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ పాకిస్థాన్ పరువు తీసేశారు. "ఈ తెలివి తక్కువ జోకర్లు భారత్‌తో పోటీ పడాలనుకుంటున్నారు. 2019 నాటి చైనా ఆర్మీ డ్రిల్ ఫోటోను ఇచ్చి, భారత్‌పై విజయమని చెప్పుకుంటున్నారు. పాకిస్థాన్ ఇలాంటి పనులే చేస్తుంది. కనీసం సరైన ఫోటోను కూడా బహుమతిగా ఇవ్వలేకపోయారు" అని ఒవైసీ దుయ్యబట్టారు. "నకల్ కొట్టడానికి కూడా అకల్ (తెలివి) కావాలని చిన్నప్పుడు స్కూలులో వినేవాళ్లం. ఈ పనికిమాలిన దద్దమ్మల దగ్గర ఆ తెలివి కూడా లేదు" అంటూ హిందీలో వ్యాఖ్యానించారు.

అంతా ఫేక్ ప్రచారమే..

పాకిస్థాన్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం ఇది మొదటిసారి కాదని నిపుణులు గుర్తుచేస్తున్నారు. మే 15న పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్, ఓ బ్రిటిష్ వార్తాపత్రికలో వచ్చినట్లుగా ఓ నకిలీ కథనాన్ని చూపిస్తూ తమ వైమానిక దళాన్ని పొగిడిన ఉదంతం కూడా వివాదాస్పదమైంది. ఆ కథనం నకిలీదని 'డాన్' పత్రిక నిజ నిర్ధారణలో తేల్చింది. మే 7న పహల్గామ్ దాడికి ప్రతిగా భారత బలగాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సింధూర్' కింద కచ్చితత్వంతో కూడిన దాడులు చేసిన తర్వాత, పాక్ సైన్యం మే 8, 9, 10 తేదీలలో భారత సైనిక స్థావరాలపై దాడికి యత్నించి, భారత మౌలిక సదుపాయాలకు భారీ నష్టం కలిగించామని ప్రకటించగా, ఆ వాదనలను భారత్ ఖండించింది.

## ఉగ్రదాడులతో భారత్‌లో అశాంతి సృష్టిస్తే మౌనంగా ఉండబోమని ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి



సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సూచనలను నాటి పాలకులు పెడచెవిన పెట్టడం వల్లే గత 76 ఏళ్లుగా దేశం ఉగ్రవాద సమస్యను ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా మంగళవారం నాడు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ప్రస్తావించారు. "ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ఒక యుద్ధ తంత్రంగా మార్చుకుంది. దీనిని భారత్ సమర్థవంతంగా ఎదుర్కొంటోంది. పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల అంత్యక్రియలకు ఆ దేశ ప్రభుత్వ అధికారులు హాజరై, ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. వారి సైన్యం కూడా ఉగ్రవాదులకు సెల్యూట్ చేసింది. ఇది ఉగ్రవాదం కేవలం పరోక్ష యుద్ధం కాదని, పాకిస్థాన్ అనుసరిస్తున్న యుద్ధ వ్యూహమని స్పష్టం చేస్తోంది. దీనికి తగిన రీతిలోనే భారత్ స్పందిస్తుంది" అని మోదీ అన్నారు. తాము శాంతినే కోరుకుంటామని, ఇతరులు కూడా శాంతియుతంగా ఉండాలనే ఆకాంక్షిస్తామని, అయితే పరోక్ష యుద్ధంతో తమ సహనాన్ని పరీక్షిస్తే మాత్రం ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. 1947 నాటి దేశ విభజనను ప్రస్తావిస్తూ, "1947లో దేశం రెండుగా చీలిన రోజే, కశ్మీర్‌లో తొలి ఉగ్రదాడి జరిగింది. సాయుధ ముఠాల సాయంతో పాకిస్థాన్ కశ్మీర్‌లోని కొంత భాగాన్ని ఆక్రమించుకుంది. ఆనాడు ఉగ్రవాదులను ఏరివేసి, ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఇచ్చిన సలహాను పాటించి ఉంటే, దేశంలో ఈ ఉగ్రదాడుల పరంపర కొనసాగేది కాదు. కానీ అప్పటి ప్రభుత్వ పెద్దలు ఆ సూచనను పట్టించుకోలేదు" అని ప్రధాని విమర్శించారు. అప్పటి నుంచి పర్యాటకులు, యాత్రికులు, సామాన్య పౌరులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని, ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఘటనే దీనికి నిదర్శనమని అన్నారు.

## ప్రపంచానికి 'సిందూర్' ప్రాముఖ్యత తెలిసింది: అమిత్ షా

న్యూఢిల్లీ : 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారతీయ మహిళల నుదుటిన వెలిగే సిందూరం యొక్క ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేశామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఆపరేషన్ దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిందని అన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించి, దేశం గర్వపడేలా చేశామని, ఇది కేవలం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం వల్లే సాధ్యమైందని ఆయన కొనియాడారు. దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూసిన శక్తులను వెనక్కి తరిమికొట్టామని, ఇప్పుడు వారు తమ చర్యలకు పశ్చాత్తాపంతో బాధపడుతున్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ దృఢ సంకల్పం, నిఘా వర్గాల కచ్చితమైన సమాచారం, త్రివిధ దళాల అద్భుతమైన సమన్వయం వల్లే 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని ఆయన గతంలోనూ పలుమార్లు స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్థాన్ భూభాగంలోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. వీటిలో రెండు ప్రధాన ఉగ్ర కార్యాలయాలు కూడా ఉన్నట్లు అమిత్ షా గతంలో తెలిపారు. అయితే, ఈ దాడుల్లో పాకిస్థానీ పౌరులకు గానీ, వారి సైనిక స్థావరాలకు గానీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు ప్రభుత్వ, సైనిక వర్గాలు వెల్లడించాయి.

## భారతీయ విద్యార్థులకు అమెరికా ఎంబసీ హెచ్చరిక

న్యూఢిల్లీ : అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులతో పాటు ఇతర అంతర్జాతీయ విద్యార్థులకు అమెరికా ప్రభుత్వం కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. స్టూడెంట్ వీసా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. తరగతులకు సరిగా హాజరుకాకపోవడం, చదువుతున్న విద్యాసంస్థకు సమాచారం ఇవ్వకుండా కోర్సు నుంచి వైదొలగడం వంటి చర్యలకు పాల్పడితే విద్యార్థుల వీసాలను రద్దు చేస్తామని మంగళవారం హెచ్చరించింది. అంతేకాకుండా, అలాంటి విద్యార్థులు భవిష్యత్తులో అమెరికా వీసాలు పొందే అర్హతను కూడా కోల్పోయే ప్రమాదం ఉందని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పేర్కొంది. "మీరు చదువు మధ్యలో మానేసినా, తరగతులకు హాజరుకాకపోయినా, లేదా మీ విద్యాసంస్థకు తెలియజేయకుండా మీ స్టడీ ప్రోగ్రామ్ నుంచి నిష్క్రమించినా, మీ స్టూడెంట్ వీసా రద్దు చేయవచ్చు. భవిష్యత్తులో అమెరికా వీసాలకు మీరు అనర్హులు కావచ్చు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎల్లప్పుడూ మీ వీసా షరతులకు కట్టుబడి ఉండండి, మీ స్టూడెంట్ స్టేటస్‌ను కాపాడుకోండి" అని యూఎస్ ఎంబసీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో, అసోసియేటెడ్ ప్రెస్ నివేదిక ప్రకారం, ఇటీవల 4,700 మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థుల స్టడీ పర్మిట్లను ఎలాంటి ముందస్తు సమాచారం గానీ, సరైన వివరణ గానీ లేకుండా అమెరికా రద్దు చేసింది. అక్రమ వలసదారులు, విదేశీ జాతీయులపై కఠిన వైఖరిలో భాగంగానే ఈ చర్యలు ఉన్నట్లు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది. అమెరికాలో అంతర్జాతీయ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లను పర్యవేక్షించేందుకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్), ప్రత్యేకించి ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) ఉపయోగించే స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సెవిస్) నుంచి విద్యార్థుల రికార్డులను తొలగించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే, చాలా సందర్భాల్లో ఈ విషయం విద్యార్థులకు గానీ, వారు చదువుతున్న విశ్వవిద్యాలయాలకు గానీ తెలియడం లేదని సమాచారం. ఈ పరిణామాల దృష్ట్యా, అమెరికాలో చదువుతున్న, చదవాలనుకుంటున్న విద్యార్థులు వీసా నిబంధనల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## భారత్ తో చర్చలకు మేం సిద్ధం.. పాక్ ప్రధాని ప్రతిపాదన

న్యూఢిల్లీ : భారత్‌తో నెలకొన్న అన్ని వివాదాలపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. కశ్మీర్, ఉగ్రవాదం, జల వివాదాలు, వాణిజ్యం వంటి కీలక విషయాలపై చర్చించి, శాంతియుత పరిష్కారం కనుగొనాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుతం నాలుగు దేశాల పర్యటనలో ఉన్న షరీఫ్, టెహ్రాన్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి, ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం ఇరు దేశాల మధ్య సరిహద్దుల్లో కాల్పులు తీవ్రమయ్యాయి. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొద్ది వారాలకే పాక్ ప్రధాని నుంచి ఈ ప్రతిపాదన రావడం గమనార్హం. "కశ్మీర్, జల వివాదాలతో పాటు అన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం. వాణిజ్యం, ఉగ్రవాద నిరోధంపై కూడా మా పొరుగు దేశంతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాం" అని షరీఫ్ పేర్కొన్నారు. అయితే, పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) స్వాధీనంపై మాత్రమేనని భారత ప్రధాని నరేంద్ర మోదీ గతంలోనే స్పష్టం చేశారు. "ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో సాధ్యం కావు. ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి నడవవు. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు. భారత్, పాకిస్థాన్ మధ్య చర్చలంటూ జరిగితే అవి కేవలం ఉగ్రవాదం, పీఓకేపై మాత్రమే జరుగుతాయని అంతర్జాతీయ సమాజానికి తెలియజేస్తున్నాను" అని మోదీ అన్నారు. కశ్మీర్ విషయంలో మూడో పక్షం మధ్యవర్తిత్వాన్ని కూడా భారత్ అంగీకరించబోదని, ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని తేల్చిచెప్పింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ, భారత్ యుద్ధ మార్గాన్ని ఎంచుకుంటే పాకిస్థాన్ తీవ్రంగా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు. "కొన్ని రోజుల క్రితం మేం చేసినట్లే, వారు దూకుడుగా వ్యవహరిస్తే మా భూభాగాన్ని మేం కాపాడుకుంటాం. కానీ, నా శాంతి ప్రతిపాదనను వారు అంగీకరిస్తే, మేం నిజంగా శాంతిని కోరుకుంటున్నామని, చిత్తశుద్ధితో ఉన్నామని నిరూపిస్తాం" అని ఆయన అన్నారు.

## హైదరాబాద్ ఐటీ కారిడార్లో ట్రాఫిక్ కష్టాలకు చెల్లుచీటీ! త్వరలో కొండాపూర్ కొత్త ఫ్లైఓవర్ ప్రారంభం

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వాహనదారులకు ఇది శుభవార్త. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఒకటి తుది దశకు చేరుకుంది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కొండాపూర్ వెళ్లేందుకు వీలుగా నిర్మిస్తున్న అత్యాధునిక మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ కొత్త వంతెన అందుబాటులోకి వస్తే, ఐటీ హబ్‌కు ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఈ ప్రతిష్ఠాత్మక ఫ్లైఓవర్‌ను జూన్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభంతో గచ్చిబౌలి జంక్షన్ వద్ద తరచూ ఎదురయ్యే తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు. వాహనదారుల ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్ వంటి ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ఈ ఫ్లైఓవర్ ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. దీని ద్వారా హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి కీలక ప్రాంతాలకు వేగంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా చేరుకోవచ్చు. గంటల తరబడి ట్రాఫిక్ లో చిక్కుకుపోయే ఇబ్బందులు తొలగిపోయి, ప్రయాణం సాఫీగా సాగుతుంది. అంతేకాకుండా, కొండాపూర్ పరిసర ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లాలన్నా లేదా విమానాశ్రయం నుంచి కొండాపూర్ వైపు రావాలన్నా గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్‌లలో ఇరుక్కోకుండా నేరుగా ప్రయాణించేందుకు ఈ ఫ్లైఓవర్ వీలు కల్పిస్తుంది.

## మేడిగడ్డ బ్యారేజీ రిపోర్టుపై ఎల్ అండ్ టీ సంచలన లేఖ

హైదరాబాద్ : మేడిగడ్డ బ్యారేజీ ఫెయిలైందంటూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్ డీఎస్ఏ) ఇచ్చిన నివేదికపై నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ మండిపడింది. బ్యారేజీ నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ పాటించలేదనే ఆరోపణలను తోసిపుచ్చింది. ఎలాంటి సాంకేతిక పరీక్షలు నిర్వహించకుండా బ్యారేజ్ ఫెయిలైందని ఎలా నిర్ణయించారని ప్రశ్నించింది. ఈ మేరకు తాజాగా ఎల్ అండ్ టీ ఓ లేఖ రాసింది. మేడిగడ్డ బ్యారేజీపై ఎన్ డీఎస్ఏ ఇచ్చిన నివేదికను పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు తేల్చిచెప్పింది. మేడిగడ్డ బ్యారేజీపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కీలక రిపోర్టును ఇటీవలే తెలంగాణ ప్రభుత్వానికి అందజేసింది. దీనిపై తాజాగా ఎల్ అండ్ టీ స్పందిస్తూ లేఖ రాసింది. ఎన్ డీఎస్ఏ నివేదికలోని ఎగ్జిక్యూటివ్ సమ్మరీ ప్రకారం.. బ్యారేజీ పనితీరును, దెబ్బతినడానికి కారణాన్ని తెలుసుకోవాలంటే తగిన సాంకేతిక పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అయితే, మేడిగడ్డ బ్యారేజీకి ఎలాంటి సాంకేతిక పరీక్షలు నిర్వహించలేదు. గ్రౌటింగ్ కారణంగా పరీక్షలు చేయలేదని ఎన్ డీఎస్ఏ నివేదికలో పలుచోట్ల స్పష్టం చేసింది. అలాంటపుడు బ్యారేజీ ఫెయిలైందని ఎలా నిర్ణయించారని ఎల్ అండ్ టీ ప్రశ్నించింది. ఏ ప్రాతిపదికన బ్యారేజీ విఫలమైందని నివేదిక ఇచ్చారని నిలదీసింది. నివేదికలోని 283వ పేజీలో క్వాలిటీ కంట్రోల్ కు సంబంధించిన నివేదికను ఎల్ అండ్ టీ సమర్పించిందని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది. అయితే, అదే నివేదికలో పలుచోట్ల క్వాలిటీ కంట్రోల్ పాటించలేదని ప్రస్తావించడం అసంబద్ధమని అన్నారు. బ్యారేజీ పునరుద్ధరణ గురించి ఇదివరకే ఒకసారి ఎన్ డీఎస్ఏతో పాటు రాష్ట్ర నీటి పారుదల శాఖకు లేఖలు రాసినట్లు గుర్తు చేసింది.

## ఖైరతాబాద్ గణేశ్: 71వ ఏడాది ఉత్సవాలకు ఏర్పాట్లు షురూ!



హైదరాబాద్: హైదరాబాద్‌లో గణేశ్ నవరాత్రులంటే ముందుగా గుర్తొచ్చేది ఖైరతాబాద్ మహాగణపతి. ఏటా ఇక్కడ కొలువుదీరే భారీ గణనాథుడిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఈ ఏడాదికి సంబంధించిన ఖైరతాబాద్ గణేశ్ విగ్రహ ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ఖైరతాబాద్ సభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది 71వ మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠాపనకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా జూన్ 6న నిర్జల ఏకాదశి పర్వదినాన విగ్రహ తయారీకి తొలి అడుగుగా కర్రపూజ నిర్వహించనున్నారు. ఈ పూజతో విగ్రహ నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమవుతాయి. సాధారణంగా ఖైరతాబాద్ గణపతి విగ్రహ తయారీకి సుమారు మూడు నెలల సమయం పడుతుంది. ఖైరతాబాద్‌లో మొదటిసారిగా 1954లో గణేశ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా విభిన్న రూపాల్లో, భారీ ఆకృతుల్లో గణపయ్య ఇక్కడ దర్శనమిస్తున్నాడు. ఉత్సవాల 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గతేడాది ప్రత్యేకంగా 70 అడుగుల ఎత్తైన మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఈసారి గణపతి ఎన్ని అడుగుల ఎత్తులో కొలువుదీరతాడనే ఆసక్తి నగర ప్రజల్లో నెలకొంది.

## విత్తన, ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 27 : చింతపల్లి మండలంలో గల విత్తన, ఎరువుల దుకాణాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసు శాఖ సిఐ రాజు, ఎస్సై రామ్మూర్తి ఇతర సంబంధిత అధికారులు కలిసి సమన్వయంతో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని ఫర్టిలైజర్స్ డీలర్లందరికీ మదనాపురం రైతు వేదికలో కోరమాండల్ ఇండియా లిమిటెడ్ ఎల్ వన్ ఈపాస్ మిషన్లను దేవరకొండ ఏ డి ఏ శ్రీలక్ష్మి, చింతపల్లి వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా, దుకాణాల రికార్డులు, ఎరువులు, విత్తన నిల్వలు, విక్రయాలు, రైతులకు రసీదులు ఇవ్వటం వంటి అంశాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు,ఎరువుల అమ్మకం నిరోధించడానికి



నకిలీ విత్తనాలు ఎరువులను విక్రయించకుండా చూడటం కోసం తనిఖీలు చేసారు. ధరల పట్టికలను దుకాణాలలో అందుబాటులో ఉంచటం ధరలను తగిన విధంగా నిర్ణయించి నిర్వాహకులకు సూచించటం కోసం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ పోలీసు శాఖలు కలిసి తనిఖీలు చేయడం ద్వారా, రైతులకు సరైన సహాయం సమాచారం అందించి దోహదం చేసారు. దుకాణాల నిర్వహణ విక్రయాలన్నీ చట్టాలకు అనుగుణంగా జరుగుతున్నాయో లేదో చూసి తనిఖీలు చేసారు. రైతులకు డీలర్లు నిర్ణయించిన ధరలకు మాత్రమే విత్తనాలు, బీటీ పత్తి విత్తనాలు, పురుగుల మందులు విక్రయించాలని, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ డిస్ట్రిక్ట్ సేల్స్ ఆఫీసర్ సతీష్ చింతపల్లి మండల కోరమాండల్ ఇన్చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి సన్నిధిలో మొదటి రోజు బాబాకు ఘనంగా ప్రత్యేక పూజలు



చింతపల్లి,సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 27: ముక్కామల పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శ్రీధర స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో, బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ శరణ్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ సాయి సన్నిధి లో 18వ (అష్టాదశమ) వార్షికోత్సవములలో భాగంగా మొదటి రోజు మంగళవారం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.



కార్యక్రమాలు వివరాలు

ఉదయం మంగళ వాయిద్య సంఘోషణ, విఘ్నేశ్వర పూజ, గోపూజ, యజ్ఞశాల ప్రవేశం, గోపూజ, భూత బలి, విఘ్నేశ్వర పుణ్య ప్రవచనం, పంచగవ్య ఆరాధన ప్రాశనం, విగ్రహ మార్ధనలు, రుత్విక్ వరుణ దీక్ష కంకణధరణ, అఖండ దీపారాధన, అస్త్ర రాజ అర్చన, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, అదేవిధంగా సాయంత్రం 4:30 నిమిషాలకు మృతంగ్రహణ, అంకు రా రోపణ, మహా మంటప ఆవాహన, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హవనములు, నవకలశార్చన, ద్వాదశలాపన, ధ్వజారోహణ, నీరాజన మంత్రపుష్పములు, రాజోపచారములు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నందున భక్తులకు ఏ లోటు రాకుండా ఆలయ కమిటీ సమకూరుస్తున్నారు.

## సిపిఐ దేవరకొండ పట్టణ కార్యదర్శిగా వలమల్ల ఆంజనేయులు




దేవరకొండ, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 27: ఈనెల 24న దేవరకొండ పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో జరిగిన సిపిఐ దేవరకొండ పట్టణ 14వ మహాసభ లో పట్టణ నూతన కార్యదర్శి గా వలమల్ల ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు గా తోటపల్లి నగేష్, జూలూరి జ్యోతిబస్ 23మంది తో పట్టణ కౌన్సిల్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో అర్హుల లిస్టులో పేరు ఉన్నప్పటికీ సొంత స్థలం లేకపోవడంతో అనర్హులుగా మారుతున్న నిరుపేదలు వారికి పార్టీలకతీతంగా ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వలన అసంపూర్తిగా గుంతల మయంగా ఉన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలని సంవత్సరాలు గడుస్తున్నా శిలాఫలకాలకే పరిమితమైన రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని పట్టణంలో ప్రధాన సమస్య మారతున్న కోతుల సమస్యను నివారించాలన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో పట్టణ సమితి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని వారన్నారు.

## సర్పంచుల పెండింగ్ బిల్లులు అడిగితే.. అక్రమ అరెస్టులా?

**రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి.**




ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 27: తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపోల్ మాజి సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి.. తులే కలాన్ మాజీ సర్పంచ్ సర్పంచ్ చిలకల యాదగిరి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాదిన్నర కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన 1200 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులను మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ కు తరలించడం దారుణమని అన్నారు. వందల కోట్ల రూపాయల బకాయిలు ఉంటే 153 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని వారు తెలిపారు.

# తెలంగాణ కేబినెట్ విస్తరణకు రెడీ

- కాంగ్రెస్ అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్
- సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉండటంతో జోరుగా ప్రచారం
- రాములమ్మకు పదవి దక్కనుందని జోరుగా ప్రచారం
- ఆశవహుల ఆశలు నిజం అవుతాయా?
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని పదవి వరిస్తుందా?






తెలంగాణ-సాయి సూర్య: తెలంగాణ కెబినెట్ విస్తరణ కొలిక్కి వచ్చినట్టు ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ఫలించినట్టే కనిపిస్తున్నాయి. ఎన్నాళ్లుగా వేచిన ఉదయం రాబోతుంది అన్నట్టుగా...మంత్రివర్గ విస్తరణ జరిగిపోనుంది. ఐతే మంత్రి వర్గ విస్తరణ జరిగితే...పదవులు ఎవరికి దక్కనున్నాయి. ఆశవహులను పదవి వరిస్తుందా? కొత్త వారు మంత్రివర్యులుకానున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం త్వరలోనే తెలియనుంది. ఐతే తాజాగా రాములమ్మ పేరు మంత్రివర్గ విస్తరణలో వినిపిస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్సీగా పదవి దక్కించుకున్న ఆమె...మంత్రిగా మారనున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. విజయశాంతి అలియాస్ రాములమ్మ. తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేకం. తెలంగాణ కోసం పార్టీ పెట్టి, పోరాడి తనకంటే ప్రత్యేకతను చాటుకున్నారు. బీఆర్ఎస్ అధినేతతో కలిసి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆమె పాత్ర కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పార్టీ పెట్టిన తర్వాత అప్పటి టీఆర్ఎస్ లో విలీనం చేసి...కొన్నాళ్లు ఆ పార్టీ ఎంపీగా కొనసాగారు. ఆ తర్వాత తెలంగాణ ఏర్పాటు సమయంలో కాంగ్రెస్ లో చేరారు. కానీ ఎక్కువ రోజులు ఉండలేకపోయారు. అక్కడి నుంచి భారతీయ జనాతా పార్టీలో చేరారు. ఐతే అనుకోని కారణాల వల్ల బీజేపీని వీడి మళ్లీ కాంగ్రెస్ లోకి వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక...కొన్ని రోజులు సైలెంట్ గా ఉన్నారు. కానీ అనూహ్యంగా విజయశాంతి ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్నారు. దీంతో రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చే జరిగింది. తాజాగా మంత్రి వర్గ విస్తరణలో విజయశాంతి పేరు వినిపిస్తోంది. మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమీకరణాలు, స్థానిక అంశాలను పరిధిలో తీసుకొని మంత్రి పదవులకు నేతలను సెలెక్ట్ చేస్తున్నట్టు తెలుస్తోంది. మహిళా కోటలో విజయశాంతికి అవకాశం కల్పించే అవకాశం ఉందంటున్నారు. అంతేకాదు...ఇప్పుడు మంత్రుల్లో కొందరిని తొలగించి...కొత్త వారికి అవకాశం కల్పిస్తారని అంటున్నారు. ఇప్పటికే ప్రేమ్ సాగర్ రావు, వివేక్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, శ్రీహరి వంటి వారు పదవుల కోసం వేయిట్ చేస్తున్నారు. ఐతే త్వరలో జాబితా వెలువడనున్నట్టు సమాచారం. చూడాలి మరి ఎవరిని పదవులు వరిస్తాయో..

# దోపిడీకి అడ్డాలుగా మీసేవ సెంటర్లు

- ఏ సేవ కావాలన్నా.. భారీగా ఛార్జీ
- -మినిమం రూ.100 ఉంటేనే సర్వీసు ఇస్తున్న కేంద్రాలు
- -కొరవడిన ఐటీ శాఖ పర్యవేక్షణ
- -సంక్షేమ పథకాలకు భారీగా వసూల్
- -ప్రజల అవసరాలను ఆసరాగా మీసేవ నిర్వహకుల దోపిడీ




సాయి సూర్య -హైదరాబాద్: మీ సేవ కేంద్రాలు దోపిడీకి తెరలేపాయి. ప్రజల అవసరాలను తీర్చాల్సి మీ సేవలు...ప్రజలను దోపిడీ చేస్తున్నాయి. మీ సేవ కేంద్రాలు అంటే...మీ సేవలో ఉంటాయని...కానీ మీమ్మల్సి దోచుకుంటామనేలా తయారయ్యాయి. ప్రజల అవసరాలను ఆసరగా చేసుకుని కొందరు నిర్వాహకులు ప్రజల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్న, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఇదే అదనుగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర శివారులోని ప్రాంతాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ పరిధిలో నకిలీ బర్త్ డే సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అధికారుల తూతూ మంత్ర చర్యలతో మళ్లీ మొదటికి వచ్చింది. తాజాగా ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకోని డబ్బులు దండుకుంటున్నారు. మీ సేవలో ఏదైనా సర్వీస్ కావాలంటే...చార్జీలు వసూలు చేస్తారు. మినిమం ఛార్జీలు చెల్లించడానికి అవకాశం ఉంది. రేషన్ కార్డు దరఖాస్తుకు చేసుకోవాలంటే ప్రభుత్వం నిర్ణయించిన చార్జీ కేవలం రూ.45, కానీ మీ సేవ నిర్వాహకులు రూ.250 పైగానే వసూలు చేస్తున్నారు. వాట్సప్ లో ఉన్న పిడిఎఫ్ ఫైల్ ప్రింట్ తీసుకుంటే కూడా రూ.150 పైగా తీసుకుంటున్నారు. ఓ బాధితుడు నార్సింగ్ లోని ఓ మీ సేవ కేంద్రానికి వెళ్లి ఓటరు ఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా, సెంటర్ నిర్వాహకుడు రూ.250 వసూలు చేశాడు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కు దరఖాస్తు చేసుకోగా రూ.200 తీసుకున్నాడు. అఫిడవిట్?చేసి ఇస్తామని మరో రూ.800 వసూలు చేశారు. ఇలా ప్రతి చిన్న అప్లికేషన్ కు నిర్వాహకులు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. తాజాగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే కార్డులో ఉన్న వారి పేర్లను తొలగించడం, కొత్త వాళ్ల పేర్లను చేర్చుకొనే దరఖాస్తుల ప్రక్రియ మీసేవ కేంద్రాలకు ద్వారా చేసుకోవాలి. ఈ దరఖాస్తుల విషయంలో నిర్వాహకులు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రజలకు గత్యంతరం లేక, కార్డు కావాలనే ఆశతో ఎంతైనా భరిస్తూ దరఖాస్తు చేస్తున్నారు. ఇక నిరంతరం సాగే కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు, బర్త్ డే సర్టిఫికెట్ల దరఖాస్తుల కోసం అర్జీదారులను నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి, సంగారెడ్డి, భువనగిరి జిల్లాల్లో మీ సేవా కేంద్రాల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకంటే భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాలపై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఉన్నతాధికారుల నియంత్రణ లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు వసూలు చేస్తున్నారు. కనీసం ఆరు నెలలకోసారైనా అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఇకనైనా తరచూ తనిఖీలు చేసి సామాన్యులకు అందే ప్రభుత్వ సేవలను పటిష్టవంతంగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

# ‘సింగరేణి జాగృతి’

**జాగృతి సైన్యంతో కల్వకుంట్ల కవిత**
**కొత్త సంస్థను ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ కవిత**
**కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ప్రకటన**
**కవిత నివాసంలో భేటీ, నూతన కమిటీ ఏర్పాటు**
**సింగరేణిలో 11 ఏరియాలకు సమన్వయకర్తల నియామకం**



హైదరాబాద్: సింగరేణి కార్మికుల సంక్షేమంతోపాటు సంస్థను కాపాడటమే ధ్యేయంగా ‘సింగరేణి జాగృతి’సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మంగళవారం తన నివాసంలో ‘సింగరేణి జాగృతి’ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థ పరిధిలోని 11 ఏరియాల కార్మికులు పాల్గొన్నారు. సమావేశంలో కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పాటైన ‘తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం’(టీబీజీకేఎస్)తో సమన్వయం చేసుకుంటూ సింగరేణి జాగృతి పని చేస్తుందని తెలిపారు. సింగరేణి కార్మికుల విద్య, వైద్య ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతితో సింగరేణి సంస్థనే అంతం చేసే కుట్రలు చేస్తోందని, వీటిని అడ్డుకుంటామని ప్రకటించారు. 11 ఏరియాలకు సింగరేణి జాగృతి కో ఆర్డినేటర్లను కవిత నియమించారు. సింగరేణి జాగృతికి అనుబంధంగా మహిళల విభాగం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కిరణ్ ఓరం (బెల్లంపల్లి), కుర్మ వికాస్ (శ్రీరాంపూర్), ఎస్.భువన్ (మందమర్రి), బొగ్గుల సాయికృష్ణ (రామగుండం 1), కె.రత్నాకర్ రెడ్డి (రామగుండం 2), దాసరి మల్లేశ్ (రామగుండం 3), నరేశ్ నేత (భూపాలపల్లి), అజ్మీరా అశోక్ కుమార్ (మణుగూరు), వన్నంరెడ్డి వీర నాగేంద్ర సాగర్ (కొత్తగూడెం), వసికర్ల కిరణ్ కుమార్ (కార్పొరేట్), కె.రామ్మోహన్ చారి (ఎస్టీపీపీ పవర్ప్లాంట్)లను ఏరియా కో ఆర్డినేటర్లుగా నియమించారు. సింగరేణి స్కూళ్లను పునరుద్ధరించాలి: సింగరేణి స్కూళ్లను పునరుద్ధరించి సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన చేయాలని కవిత డిమాండ్ చేశారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ హాస్పిటళ్లలో ఉచిత వైద్యం అందించాలని కోరారు. అన్ని రీజియన్లలో కార్మికుల కోసం కొత్త క్వార్టర్స్ నిర్మించాలని కోరారు. జైపూర్ పవర్ ప్లాంట్ రెండో దశ పనుల అంచనా పెంపులో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు.

## జూన్ 2న యువ వికాసం మంజూరు పత్రాలు

**వచ్చేనెల 10 నుంచి 15 వరకు అర్హులకు శిక్షణ కార్యక్రమాలు**
**ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడి**



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హత సాధించిన లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ రెండో తేదీన మంజూరు పత్రాలను అందిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఈ మంజూరు పత్రాల పంపిణీకి క్షేత్రస్థాయిలో అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యువ వికాసం పథకం అమలు పురోగతిపై మంగళవారం సచివాలయంలో సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు భట్టి పలుసూచనలు చేశారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రాజీవ్ యువ వికాసం పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించాలన్నారు. జూన్ 10 నుంచి 15 వరకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూన్ 16వ తేదీ నుంచి స్వయం ఉపాధి యూనిట్ల ప్రారంకోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గాంధీ జయంతి నాటికి యూనిట్లన్నీ గ్రౌండింగ్ అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. సంక్షేమ శాఖ అధికారులు బ్యాంకర్లతో తరచూ మాట్లాడుతూ స్వయం ఉపాధి పథకాన్ని విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు. కీర్తి ప్రతిబింబించేలా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు: తెలంగాణ రాష్ట్ర చరిత్ర, కీర్తి ప్రతిబింబించేలా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని, ఇందు కోసం ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నతాధికారులకు సూచించారు. ఆవిర్భావ దినోత్సవ సమన్వయ సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై భట్టి సమీక్షించారు. సమావేశంలో భాగంగా భట్టి మాట్లాడుతూ ఈసారి అవతరణ వేడుకలకు అతిథులుగా జపాన్ మేయర్‌తో పాటు మిస్‌వరల్డ్ విజేతలు హాజరవుతారని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని కేసీఆర్ అన్నారు..



**హైదరాబాద్, :** కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని అన్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తు చేశారు. విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు పెట్టకుండా ఎలా ఇస్తున్నారు.. ఉన్నవన్నీ కాంగ్రెస్ పార్టీ హయంలోనివే అని చెప్పాను.. భద్రాద్రి, యాదాద్రి నుంచి కరెంటు ఉత్పత్తి కాలేదని చెప్తే కేసీఆర్ నుంచి సమాధానం లేదు.. మిగులు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు సాగుతున్నాం.. 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చినా కోతలు లేకుండా ఇస్తున్నామంటే అది కాంగ్రెస్ పాలన.. 2050 నాటికి గాలి, సోలార్, నీటి ద్వారా విద్యుత్ ఉత్పత్తిని 20 వేల మెగావాట్ల లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం.. 29 లక్షల పంపు సెట్లకు ఇచ్చే కరెంట్ కు రూ.12,500 కోట్లు రైతుల పక్షాన కడుతున్నాం.. మహిళల అభివృద్దే, రాష్ట్ర అభివృద్ధి అని ముందుకు సాగుతున్నాం.. మహిళలకు లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి అన్నారు. ఇక, 22 వేల కోట్ల రూపాయలతో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్లలో గిరిజనుల గురించి ఏనాడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. సాగు చేసుకుంటుంటే ఆడవాళ్ళు అని చూడకుండా చెట్టుకు కట్టేసి కొట్టారు.. మా ప్రభుత్వంలో ఇందిరా సౌరగిరి జలవికాస పథకం అమలు చేస్తున్నాం.. అడవీని రక్షిస్తూనే.. అడవి బిడ్డల ఆత్మగౌరంగా బతికేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.. గత ప్రభుత్వ హయంలో పెండింగ్ లో ఉంచిన రూ. 8వేల కోట్ల బకాయిలు తీర్చాం.. దెయ్యాలకు నాయకత్వం వహించిన వాళ్ళు దేవుడెలా అవుతారు? అని అడిగారు. ప్రజలను వేధించే దెయ్యాలను తరిమికొట్టే సమయం ఆసన్నమైంది.. ఈ రాష్ట్రంలో సంపద సృష్టిస్తాం, ప్రజలకు పంచేస్తామన్నారు. ప్రజల పక్షమే, మా పాలన లక్ష్యం.. పాలమూరు జిల్లాలో కట్టిన ప్రతి ప్రాజెక్ట్ కాంగ్రెస్ కట్టిందే.. పాలమూరుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.. ప్రాధాన్యతగా ప్రాజెక్ట్ లు పూర్తి చేస్తాం.. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును నిత్యం పర్యవేక్షిస్తూ.. అవసరమైన చోట భూసేకరణకు నిధులు విడుదల చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు.

## దాడులపై 30 నిమిషాల్లోనే పాకిస్తాన్‌కి సమాచారం అందింది: జైశంకర్..



**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత్, పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని "ఆపరేషన్ సిందూర్" ప్రారంభించింది. మొత్తం 09 లష్కరేతోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే, భారతదేశం ఆపరేషన్ ప్రారంభించిన 30 నిమిషాల్లోనే పాకిస్తాన్ అప్రమత్తమైందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీకి తెలియజేసినట్లు తెలిసింది. మే 07 రాత్రి ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన అరగంటలోపు, ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పాకిస్తాన్‌కి సమాచారం ఇచ్చాం. భారతదేశం, పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ మధ్య ప్రత్యక్ష సంభాషణ తర్వాత రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ముందుగా పాకిస్తాన్ ఈ ప్రతిపాదన చేసింది" అని జైశంకర్ చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ మరియు పాకిస్తాన్ నుండి ఉద్భవించే సీమాంతర ఉగ్రవాదం గురించి చర్చించడానికి ఎస్ జైశంకర్ అధ్యక్షత వహించిన విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో కెసి వేణుగోపాల్, మనీష్ తివారీ, ముకుల్ వాస్నిక్, ప్రియాంక చతుర్వేది, అప్రజిత సారంగి, గుర్జిత్ ఆజ్లా వంటి ఎంపీలు పాల్గొన్నారు. భారతదేశం ఖచ్చితత్వంతో వ్యవహరించిందని, ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుందని, పరిస్థితి తీవ్రతరం కాకుండా ఉండటానికి పాకిస్తాన్‌కు వెంటనే ఈ విషయాన్ని తెలియజేసిందని జైశంకర్ సభ్యులకు చెప్పినట్లు తెలిసింది. పాకిస్తాన్ పెద్ద ఎత్తున ప్రతీకారం తీర్చుకోవచ్చని అమెరికా విదేశాంగ కార్యదర్శి నిఘా వర్గాలకు సమాచారం అందించినప్పుడు భారత్ తీవ్రంగా స్పందించిందని జైశంకర్ చెప్పారు.

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ..
## ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లను నియమించాం..



**హైదరాబాద్, :** సచివాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ట్రాన్స్ జెండర్లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. ఈ మీటింగ్ కు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరు అయ్యారు. గత ఆరు నెలల క్రితం ప్రయోగాత్మకంగా 44 మందిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. దేశంలో మొట్ట మొదటిసారిగా ట్రాఫిక్ అసిస్టెంట్గా ట్రాన్స్ జెండర్లను తీసుకుంది. కేవలం పది రోజుల్లోనే ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్ను నియమించి తెలంగాణ సర్కార్ రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ట్రాన్స్ జెండర్లు అంటే సమాజంలో చిన్న చూపు ఉందన్నారు. కానీ దాన్ని అధిగమించి ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లు తమ సత్తాను చాటారు.. ట్రాన్స్ జెండర్లకు అవకాశాలు కల్పిస్తే రాణిస్తామని ట్రాఫిక్ అసిస్టెంట్లు నిరూపించారు.. గత ఆరు నెలల్లో సకాలంలో విధులకు హాజరై తమ అంకిత భావాన్ని ప్రదర్శించారని తెలిపారు. ఎంతో క్లిష్టమైన ట్రాఫిక్ డ్యూటీని క్రమశిక్షణతో వహిస్తున్నారు.. ప్రతి ఒక్కరిలో సమర్థత ఉంటుందని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ట్రాన్స్ జెండర్లు గొప్ప ఉదాహరణగా నిలుస్తున్నారు.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లను నియమించాం.. ఈ విషయాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ లోని ఉదయపూర్ లో నిర్వహించిన చింతన్ శివిర్ లో నేను ప్రత్యేకంగా ప్రస్తావించాను అని మంత్రి సీతక్క వెల్లడించారు. ఇక, తెలంగాణ మోడల్ ను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు కూడా ఫాలో అవుతున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలుస్తోంది.. ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లు తమను తాము నిరూపించుకున్నారు.. పోలీస్ శాఖలోనే కాకుండా ఇతర శాఖలో కూడా ట్రాన్స్ జెండర్లను నియమించే ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు.. ఎక్కడ ట్రాన్స్ జెండర్ల మీద వివక్షత లేకుండా అన్ని రంగాల్లో వారికి అవకాశాలు కల్పిస్తాము అన్నారు. ట్రాన్స్ జెండర్లందరికీ ట్రాఫిక్ అసిస్టెంట్లు ఆదర్శంగా నిలుస్తున్నారు.. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది గౌరవప్రద ఉద్యోగాలు చేసేందుకు ముందుకు రావాలి అని మంత్రి పిలుపునిచ్చారు. పోలీస్ డ్రెస్ లో ట్రాన్స్ జెండర్లను చూసి సామాన్యులు సెల్యూట్ చేస్తున్నారు.. ఒకప్పుడు అవమానాలు ఎదుర్కొన్న ట్రాన్స్ జెండర్లు ఇప్పుడు అపూర్వ గౌరవాన్ని అందుకుంటున్నారు అని చెప్పుకొచ్చారు. సీఎం ఇచ్చే అవకాశాలను ట్రాన్స్ జెండర్లు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క తెలిపారు.

## మళ్లీ కరోనా విజృంభణ.. వెయ్యి కేసులు నమోదు

**న్యూఢిల్లీ,:** భారతదేశంలో మరోసారి కరోనా విజృంభిస్తోంది. మళ్లీ చాపకింద నీరులా పాకుతోంది. కోవిడ్? పూర్తిగా అంతరించిపోయిందన్న భావనలో ఉన్న ప్రజలకు మళ్లీ షాకిస్తోంది. కొత్త వేరియంట్?రూపంలో ప్రజలకు దడ పుట్టిస్తోంది. కొద్ది రోజులుగా స్తబ్ధతగా ఉన్న కేసులు.. మళ్లీ అమాంతంగా పెరిగిపోతున్నాయి. మొదటి వేవ్, సెకండ్ వేవ్ కారణంగా ఎంత మంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాల్లో కోవిడ్ విషాదాన్ని నింపి వెళ్లింది. ఇప్పుడిప్పుడే మనుషులు తిరిగి నార్మల్ స్థితికి వస్తున్న తరుణంలో మరోసారి కరోనా వార్త ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. దేశ వ్యాప్తంగా కేసులు పెరిగాయని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. సోమవారం నాటికి దేశ వ్యాప్తంగా 1,009 యాక్టివ్ కోవిడ్-19 కేసులు నమోదయ్యాయని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇటీవల 752 కేసులండగా.. సడన్‌గా ఆ సంఖ్య వెయ్యికి పైగా దాటి పోయింది. దీంతో మరోసారి ప్రజల్లో భయాందోళన మొదలైంది. లాక్‌డౌన్‌లాంటి పరిస్థితులు తలెత్తుతాయేమోనని ఆలోచన మొదలైంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రస్తుతం అత్యధికంగా కేరళలో 430 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ పేర్కొంది. కేరళ అగ్ర స్థానంలో ఉన్నట్లుగా చెప్పింది. ఇక పశ్చిమ బెంగాల్‌లో 11 యాక్టివ్ కేసులు ఉన్నట్లు పేర్కొంది. రోగులంతా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లుగా ఆరోగ్య శాఖ గుర్తించింది. ప్రస్తుతం రోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇక పెరుగుతున్న కోవిడ్ కేసులతో భయపడాల్సిన అవసరం లేదని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో 104 కేసులు ఉన్నాయని.. వీటిని ఎదుర్కోవడానికి ఆస్పత్రులు సిద్ధంగా ఉన్నాయని.. ప్రజలకు ఎలాంటి ఆందోళన అక్కర్లేదని పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అనేక రాష్ట్రాల్లో మహారాష్ట్రలో 209 కేసులు, ఢిల్లీలో 104 కేసులు, గుజరాత్‌లో 83 కేసులు, కర్ణాటకలో 47 కేసులు నమోదయ్యాయి.

# పల్లె దృశ్యాన్ని మార్చిన మహిళలు

### ఎడారి నేల జలకళ
### దుఃఖనది జీవనది అయ్యింది
### బందిపోట్లు రైతులయ్యారు
### కరౌలీ పచ్చదనానికి మారుపేరైంది



రాజస్థాన్ అనగానే గుర్తొచ్చేది ఎడారి. అందులోనూ కరౌలీ జిల్లా అంటేనే నీటికోసం తండ్లాట. వరుస కరువులు. పచ్చదనం అంటే తెలియని పల్లెలు. ఈ దృశ్యాన్ని మార్చేశారు మహిళలు. చుక్క చుక్కను ఒడిసిపట్టి పొఖార్(నీటికుంట)లను సృష్టించారు. ఉపాధి లేక బందిపోట్లుగా మారిన పురుషులను వ్యవసాయం వైపు మళ్లించి.. మళ్లీ రైతులను చేశారు. బంజరు నేలల్లో ఇప్పుడు బంగారం పడిస్తున్నారు. దుఃఖనదిలా మారిన షేర్నిని మళ్లీ జీవనదిగా మార్చారు. మే నెల మండుటెండల్లోనూ కరౌలీ చెరువులు, పొఖార్లు నీటితో కళకళలాడుతున్నాయి. నెమ్మదిగా ప్రవహిస్తున్న సేర్ని నది ఒడ్డున పిల్లలు ఆడుకుంటున్నారు. ఆ పక్కనే పశువులు మేస్తూ ఉన్నాయి. ఒక దశాబ్దం క్రితం, ఎవరూ ఊహించని దీనిని మహిళలు సాధ్యం చేసి చూపించారు. అదెలా సాధ్యమైందంటే... రాజస్థాన్‌లోని కరౌలీ జిల్లా.. కరువుకు మారుపేరు. వాతావరణ మార్పులతో వర్షపాతం తగ్గింది. భూములు బంజరుగా మారా యి. నీటి వనరులు లేవు. 50 ఏళ్ల కిందట జీవనాధారంగా ఉన్న వ్యవసాయం, పశుపోషణ లే కుండా పోయింది. వేరే మా ర్గం లేక చాలా మంది వలసపోయారు. ఉపాధి లేక కొందరు నగరాలకు వలస వెళ్లగా, మరికొందరు మై నింగ్‌వైపు మొగ్గుచూపా రు. ఇంకొందరు బందిపోట్లుగా మారారు. ఒక్క సారి ఇంటినుంచి వెళ్లిన వారు తిరిగి ఇంటికొస్తారో లేదో తెలియదని భయం. మైనింగ్ నుంచి వచ్చే సిలికా ధూళితో సిలికోసిస్ అనే ఊపిరితిత్తుల వ్యాధికి కారణమయ్యింది. ఈ పనిలోకి వెళ్లినవారిలో 74శాతం మంది వ్యాధి బారిన పడ్డారు. చాలామంది 40 ఏళ్లు దాటి జీవించలేదు. నీటికరువు ఆ ప్రాంత సామాజిక పరిస్థితిని కూడా మార్చేసింది. నీళ్లు లేని కారణంగా ఆ జిల్లాలోని గ్రామాలకు పిల్లనివ్వాలంటే భయపడేవారు. మరోవైపు వరుస కరువులు, పేదరికంతో తమ ఆడపిల్లలకు తొందరగా పెళ్లిళ్లు చేసి పంపేవారు కరౌలీ జిల్లాలోని గ్రామస్తులు. అందరి జీవితాల్లో ఒకరకమైన నిరాశ.

### కరువు నుంచి లక్షాధికారుల వరకు..

2010లో మార్పునకు బీజం పడింది. నీటి సంరక్షణ స్వచ్ఛంద సంస్థ తరుణ్ భారత్ సంఘ్‌వారి జీవితాల్లోకి వచ్చింది. ఒకప్పటి చెరువులన్నీ ఎండిపోయాయి. మట్టి, ఇసుకతో నిండిపోయాయి. వాటిని పునరుద్ధరణకు నడుం కట్టారు మహిళలు. ఆలంపూర్ గ్రామ సంపత్తి దేవి అనే మహిళ అప్పటిదాకా తాను కూడబెట్టిన మొత్తాన్ని ఖర్చు చేసి 2015-16లో కొండ కింద పొఖార్‌ను నిర్మించింది. వర్షాలు పడినప్పుడు కొండపైనుంచి వచ్చిన నీటితో పొఖార్ నిండిపోయింది. ఏడాదికి సరిపడా నీరు. బందిపోటు అయిన భర్తను వ్యవసాయానికి ఒప్పించింది. 58 ఏళ్ల జగదీష్, ఆయన భార్య కలిసి ఇప్పుడు ఆవాలు, గోధుమలు, చిరుధాన్యాలు, కూరగాయలు పండిస్తున్నారు. ప్రతి సీజన్‌లో లక్షరూపాయలు సంపాదిస్తున్నారు. అదే జిల్లాలోని భూరే?డ గ్రామానికి చెందిన ప్రేమ్.. బిడ్డలకు చిన్నవయసులోనే పెళ్లి చేసింది. ఆర్థిక ఇబ్బందులతో భర్త బందిపోటుగా మారాడు. ఈ పరిస్థితి మార్చాలనుకుంది. గ్రామ శివార్లలో పొఖార్ నిర్మించేందుకు నాలుగు బిగాల సొంత భూమిని ఇచ్చింది. చెరువు నీటితో గోధుమలు, చిరుధాన్యాలను పండిస్తూ గర్వంగా కుటుంబాన్ని పోషించుకుంటోంది. బందిపోటు నుంచి రైతుగా మారిన మరో వ్యక్తి భూరే?డకు చెందిన 60 ఏళ్ల లజ్జా రామ్. 'నా తండ్రి రైతు. ఆ కాలంలో తగినంత నీరు ఉండేది. నేను పెరిగేకొద్దీ వర్షపాతం తగ్గింది, బావులు ఎండిపోయాయి. వ్యవసాయం కష్టమైంది. పశువులు చనిపోయాయి, తరువాత మా ప్రాణాలు పోతాయేమో అనిపించింది. అలా దొంగగా మారిపోయాను. నేను లొంగిపోయేందుకు నా సోదరి ఒప్పించింది. ఇప్పుడు మా 10 బిగాల భూమిలో గోధుమలు, ఆవాలు, శనగలు, ముత్యాల మిల్లెట్లను పండిస్తున్నారు. ఎనిమిది గేదెలు, మేకలతో ఆనందంగా ఉన్నాం'అని చెబుతున్నాడు.

### జీవనదిగా మారిన సేర్ని...

ఈ పదిహేనేళ్ల కాలంలో.. జిల్లాలోని చుట్టుపక్కల అడవిలో ఇటువంటి 16 పొఖార్లను నిర్మించారు. ఇవన్నీ వర్షపు నీటిని ఒడిసిపట్టేవే. వీటినుంచి డీజిల్ పంపుల ద్వారా సాగుకు వాడుకుంటారు. పొఖార్లతో భూగర్భజలం మట్టం పెరిగింది. నేలను తవ్వితే ఐదు నుంచి పది అడుగుల లోపే నీరు అందుతుంది. జిల్లాలోని సేర్ని నది.. 40 ఏళ్లకిందట ఏడాది పొడవునా ప్రవహించేది. వాతావరణ మార్పులు.. అది ఎండిపోయేలా చేశాయి. దీపావళి పండుగ అయిపోయిందంటే నదిలో చుక్క నీరు కనిపించకపోయేది. కానీ.. ఇప్పుడది జీవనదిగా మారింది. వేసవిలోనూ నీరు ప్రవహిస్తోంది. నీరు జీవం.. నీటితో స్థిరత్వం వస్తుంది. నీటి గతిని అనుసరించే నాగరికతలు ఏర్పడ్డాయి. ఇప్పుడా నీరే రాజస్థాన్ ఎడారి జీవితాలను మార్చేసింది.

# ప్రపంచానికి చైనా పాఠం!



జెనీవాలో కొద్ది రోజుల క్రితం జరిగిన అమెరికా-చైనా పన్నుల ఒప్పంద పరిణామాలు, పర్యవసానాలు ఆ రెండు దేశాల మీద ఎలా ఉండేదీ ముందు ముందు చూడాల్సి ఉంది.అది నేర్పిన పాఠం ఏమిటంటే మనం కూడా చైనా మాదిరి గట్టి ఎత్తుగడలను ఎందుకు అనుసరించ కూడదు అనే ఆలోచనకు దోహదం చేయటం ఆహ్వానించదగిన పరిణామం.ఇప్పుడు భూభౌతిక రాజకీయ బలాబలాల్లో ఎన్ని దేశాలు అమెరికా అదిరింపులు బెదిరింపులను తట్టుకొని నిలుస్తాయన్న ప్రశ్న ఎలాగూ ఉంటుంది, అయినప్పటికీ ఒకసారి అలాంటి ఆలోచన మొదలైన తర్వాత కచ్చితంగా ప్రయత్నమైతే చేస్తాయి. అమెరికా 145 నుంచి 30, చైనా 125 నుంచి పది శాతానికి ప్రకటించిన ప్రతి సుంకాలను తగ్గించేందుకు ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రకటించిన మూడు నెలల విరామం జూలైలో ముగియనుంది, అయినప్పటికీ ఒప్పందం కోసం అమెరికా అర్రులు చాచటంతో జెనీవాను వేదికగా నిర్ణయించారు. కనీసం 150 దేశాలు తమతో సంప్రదింపుల కోసం వరుసలో నిలిచినట్లు ట్రంప్ గొప్పగా చెప్పుకున్న సంగతి తెలిసిందే. చైనాను పొడిచేస్తా అది చేస్తా అని ప్రగల్భాలు పలికిన అమెరికా పెద్ద హడావుడి లేకుండా జెనీవా విమాన మెక్కటం దాని తొలి పరాజయం. చైనా ధృడవైఖరి అనేక దేశాలను ఆశ్చర్యపరచింది, ఏమి చూసుకొని అమెరికాతో పెట్టుకుంటున్నది అని తలలు పట్టుకున్నవారు కూడా లేకపోలేదు.దీర్ఘకాలం కలసి కాపురం చేసిన తర్వాత ఎవరి బలాలు బలహీనతలేమిటో పరస్పరం తెలుస్తాయన్నది తెలిసిందే, అదే విధంగా చైనా-అమెరికా వాణిజ్య సంబంధాల చరిత్ర నేర్పుతున్న పాఠమిదే. అమెరికాకు అగ్రస్థానం పేరుతో అతిగా ప్రవర్తించి అభాసుపాలైనట్లు ట్రంప్‌కు తెలిసి వచ్చి దిగివస్తున్నాడన్నదే ఒక్క ముక్కలో జెనీవా చర్చల సారం, చైనా అనుసరించింది సరైన మార్గమని భావిస్తున్నారు. దాంతో బహిరంగంగా వెల్లడించక పోవచ్చుగానీ అమెరికాతో ఆడే ఆటలో ఎన్ని తురుపు ముక్కలను ఎలా ప్రయోగిం చాలో ఎత్తువేసేందుకు, గట్టిగా నిలిస్తే తమకు ఎంత లాభం,నష్టం అనే లెక్కలో కొన్ని దేశాలు పడ్డాయంటే అతిశయోక్తి కాదు. దీనిలో భాగంగానే గత వారంలో దక్షిణ కొరియాలో జరి గిన ప్రాంతీయ సమావేశానికి అమె రికా వాణిజ్య ప్రతినిధి వచ్చిన కారణ ంగా ముఖం చాటేసేందుకు జపాన్ ప్రతినిధి రాలేదని వార్తలు వచ్చాయి. జూన్‌లో అమెరికాతో ఒప్పందం చేసుకోబోతున్నట్లు ఇటీవల జపాన్ ప్రతి నిధి చెప్పాడు. అయితే జూలై వరకు వేచి ఉండాలని నిర్ణ యించినట్లు తాజాగా మీడియా పేర్కొన్నది. ఈ ఏడాది అక్టోబరు నాటికి ఒప్పందం కుదుర్చుకుంటామని లీకులు వదిలిన మన వాణిజ్య మంత్రి పియూష్ గోయాల్ ప్రస్తుతం వాషింగ్టన్ పర్యటనలో ఉన్నారు. జపాన్, దక్షిణ కొరియాలతో చర్చలకు సమయం పడుతుందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పాడు, ఐరోపాతో కూడా నెమ్మదిగానే మాటలుంటాయన్నాడు. కొందరు మినహా అనేక దేశాలు మంచి ప్రతిపాదనలతో ముందుకు వస్తున్నాయని చెప్పుకున్నాడు. ఇప్పటి వరకు చైనా, బ్రిటన్‌తో అమెరికా కుదుర్చుకున్న ఒప్పందాలను చూస్తే సమస్యలు పూర్తిగా పరిష్కారమైనట్లు కాదని, వాణిజ్య చిత్రం రోజురోజుకూ చీలిపోతున్నదని ఐరోపా సమాఖ్య ఆర్థికవేత్త వాల్డిస్ వ్యాఖ్యానించాడు. లాటిన్ అమెరికా సమస్య భిన్నమైనది. దానికి చైనా నుంచి వచ్చే పెట్టుబడులు కావాలి, తమ ఎగుమతులకు అమెరికా మార్కెట్ అవసరం.అందుకని ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. హడావుడి చేయకుండా తమపని తాము చేస్తున్నాయి.ప్రతి సుంకాలకు ముందు సంప్రదింపుల గురించి మాట్లాడిన బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డిసిల్వా ఇటీవల చైనా పర్యటనకు వెళ్లి 30కి పైగా ఒప్పం దాలు కుదుర్చుకు రావటం అమెరికాకు ఆగ్రహం తెప్పించింది. అమెరికా తమకు ప్రధాన మిత్రదేశమే అని దౌత్యవేత్తలు ఒకవైపు చెబుతుండగానే కొలంబియా అధ్యక్షుడు గుస్తావ్ పెట్రో కూడా గతవారం బీజింగ్ సందర్శనలో ఒప్పందాలు చేసుకున్నాడు. మొత్తం మీద అన్ని దేశాలకు ఒక్కటి అర్థమైంది. ఎంతవారలైనా కాంతదాసులే అన్నట్లుగా పైకి ఎన్ని బింకాలు పలికినా అంతర్గతంగా తలెత్తిన ఆర్థిక వత్తిళ్లకు లొంగిపోవటం ట్రంపునకూ తప్పదని తేలిపోయింది. మబ్బు లను చూసి చేతిలోని ముంత నీళ్లు ఒలకపోవటం అవసరమా అన్నట్లుగా విదేశీ వస్తువుల మీద వేసే పన్నులతో వచ్చే రాబడి సంగతి తర్వాత మనమీద పడే భారాన్ని ఎవరు భరించాలన్న చర్చ, వినియోగదారులపైనే పడనుందన్న భయంతో అమెరికాలో వ్యతిరేకత, అంతర్జాతీయంగా దేశాలను బెదిరించే స్థితిలో లేమన్న వాస్తవం ట్రంప్‌ను రాజీకి దిగివచ్చేట్లు చేస్తున్నాయని చెప్పవచ్చు.

# పసితనంపై పగ




పిల్లలు, పువ్వులు, పిట్టలు, పావురాలు సున్నితము, సుకుమారము పసినవ్వుల పరిమళాలకు పరవసించని హృదయముంటుందా! ”పాపం పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం సౌఖ్యం శ్లేషార్థాలు, ఏమీ ఎరుగని పూవు ల్లారా! ఐదారేడుల పాపల్లారా!” అని మహాకవి ఆలపించిన శైశవగీతికలో పాల నురగలను పల్లవిస్తాడు. పిల్లలను చూడగానే జాలి, దయ, కరుణ, ప్రేమ తప్ప మరేమీ తలపులోకి రాదు. పసిబుగ్గలు కనపడగానే ప్రేమ పూర్వక ముద్దునీయడంలో వున్న తీయదనం మరెందులో వుంటుంది. పిల్లలు దేవుడి రూపాలని చెప్పుకోవడం మనందరికీ తెలుసు. అట్లాంటి పిల్లలను శత్రువులుగా పేర్కొనే మనస్తత్వాన్ని మనుషుల్ని ఏ దుర్మార్గాలతో పోల్చవచ్చో ఇంకా వెతుక్కోవాల్సి వుంది. ఎందుకు పిల్లలు శత్రువులవుతున్నారు! ‘ ఏ ఉన్మాదం తలకెక్కిందో ఎందుకు ఈ హంగామా! అంటే అది కచ్చితంగా యుద్ధోన్మాదమే. సామ్రాజ్యవాదపు యుద్ధోన్మాదం మనుషులను రాక్షసుల కన్నా దుర్మార్గంగా తయారు చేస్తుందనడానికి ఇదో ఉదాహరణ. ఇజ్రాయిల్ పార్లమెంటు మాజీ సభ్యుడు మోషే ఫైగ్లిన్ ఒక ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ‘మా శత్రువు హమాస్ కాదు. హమాస్ మిలటరీ వింగ్ కూడా కాదు, గాజాలో ప్రతి చిన్నారే మాకు శత్రువు. గాజాను మేము పూర్తిగా ఆక్రమించి అక్కడ స్థిరపడాలి. అక్కడ ఒక్క గాజా చిన్నారి కూడా మిగలకూడదు. దీనికంటే మరో విజయం లేదు’ అని మాట్లాడిన మాటలు ప్రపంచ మానవ హృదయాలకు దిగ్భ్రాంతి కలిగించాయి. యుద్ధోన్మాది రాక్షస మనస్తత్వం ఎంత దారుణంగా ఉంటుదో ఫైగ్లిన్ రూపంలో దర్శనమిచ్చింది. ఉగ్రవాదులు సైతం పిల్లల్ని, మహిళల్ని వొదిలేసారే! కానీ ఈ దుష్టత్వం పిల్లలపైనే గురి పెట్టింది. గాజాలో చిన్నారులు మిగలకూడదని ప్రకటించడం ఎంతటి అమానుషత్వం! ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్న దాడులు రెండేండ్ల నుండి కొనసాగూనే ఉన్నాయి. ప్రపంచమంతా చూస్తూనే ఉంది. హమాస్ దాడి చేసిందనే నెపంతో ఇజ్రాయిల్ పాలస్తీనా దేశాన్నే లేకు ండా చేయాలని దాడులు చేస్తూ మానవ హననానికి పాల్పడుతోంది. పాలస్తీనాలోని గాజాలో ఎక్కడచూసినా శిథిల దృశ్యాలే కనపడతాయి. యుద్ధానికి కూడా ఒక నీతి, న్యాయం ఉంటుంది.ఇది యుద్ధం కాదు. యుద్ధమంటే ఇరుపక్షాలూ తలపడాలి. ఇక్కడ ఏకపక్షంగా దాడి జరుగుతూనే ఉంది. అంతర్జాతీయ సంస్థలు, దేశాలు ఈ దాడిని ఆపాలని చేసిన ప్రయ త్నానికి ఇజ్రాయిల్ స్పందించడమే లేదు. ఫైగ్లిన్ మాటలు అతని వ్యక్తిగతమైనవేమీ కాదు. ఇజ్రాయిల్ ఆలోచనలే ఆయన వెల్లడించాడు. ప్రపంచమంతా చూస్తుండగానే అంతటి అమా నవీయంగా మాట్లాడటం ఎంతో నేరపూరిత మైనది. తమ దేశంలోనే గాజా ప్రజలు పరాయిగా బతుకుతున్నట్లు ప్రతిక్షణం భయ కంపితుల వుతున్నారు. ఎక్కడ యుద్ధం వచ్చినా బలయ్యేది పిల్లలు, స్త్రీలే. గాజా నేలపై కూడా చివురుల్లాంటి పిల్లలు బాంబుల దాడుల్లో రక్తం చింది స్తున్నారు. పిట్టల్లా రాలి పడుతున్నారు. ”అస్థిమూల పంజ రాలు, ఆర్తరావమందిరాలు, ఏ దేశం తల్లీ! ఇది ఎన్నో ఇట భాష్పజలాలు” అని యుద్ధ బీభత్సాన్ని కవి వర్ణించిన విధంగానే గాజా రోధిస్తున్నది. గతవారం లోనే గాజాపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో నూట నలభై మంది చనిపోవడం, ఆహారం దొరక్క ఆకలితోనూ మరణిస్తుండటం మనసును కలచివేస్తున్నది. ఇది కేవలం ఇజ్రాయిల్ దుర్మార్గమే కాదు, ఇజ్రాయిల్‌కు, దాని పాలకుడు నెతన్యాహుకు పూర్తి మద్దతుగా నిలిచిన దేశాలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదపు సహకారంతోనే ఇంత మానవ హననం జరుగు తున్నది. ప్రపంచంలోని అనేక దేశాలు ఇంత దారుణం జరుగుతున్నా మాట్లా డకపోవడం అన్యాయం. ఎప్పటినుండో పాలస్తీనాకు మనకు స్నేహ సంబం ధాలు ఉండేవి. కానీ అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామిగా మారాక భారత దేశం కూడా ఇజ్రాయిల్ పక్షం వహించడం, ఈ మారణకాండనూ ఖండించక పోవడం అమానవీయతే అనిపించుకుంటుంది. ఇక్కడి మతో న్మాద ఆలోచనలకు యుద్ధోన్మాద ఆలోచనలకు సఖ్యత ఏర్పడుతోంది. ఇది అత్యంత బాధాకరమైన విషయం. ప్రపంచశాంతిని, స్వేచ్ఛను కోరుకునే వాళ్లందరూ ఇజ్రాయిల్ దమనకాండను ఖండించాలి. పసిపిల్లలను కసితో చంపుతున్న హంతక చర్యలను వ్యతిరేకించాలి. గాజాకు ఆహార పదార్థాలను సైతం రానీయకుండా, ఆసుపత్రుల్లో మందులు, వైద్య సదుపాయాలు లేకుండా హాహాకారాలు చేస్తున్న పిల్లలు, జనుల దృశ్యాలు మనుషులైన వారినందరినీ తీవ్రమనోవేదనకు బాధకు గురిచేస్తున్నది.

## మోడీతో పోరాడటం ఇంత కష్టమని ఉగ్రవాదులు కలలో కూడా ఊహించి ఉండరు..



**న్యూఢిల్లీ,:** ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన సొంత రాష్ట్రం గుజరాత్ లో పర్యటిస్తున్నారు. ఆయన రూ.77 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఐదు నగరాల్లో నాలుగు రోడ్ షోలు, మూడు బహిరంగ సభల్లో ప్రధాని ప్రసంగించనున్నారు. దీనితో పాటు, 'మేక్ ఇన్ ఇండియా' కింద, దాహోద్‌లో రూ. 21 వేల కోట్లకు పైగా వ్యయంతో ఏర్పాటు చేసిన రైల్వే ఉత్పత్తి యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. తన రెండు రోజుల పర్యటనలో మొదటి రోజున, ప్రధాని వడోదర, భుజ్, అహ్మదాబాద్‌లలో రోడ్ షోలు నిర్వహించనున్నారు. సోమనాథ్-అహ్మదాబాద్ వందే భారత్ రైలును ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. వడోదరలో అద్భుతమైన రోడ్‌షో తర్వాత, ప్రధాని మోదీ దాహోద్‌కు బయలుదేరి వెళ్లారు, అక్కడ ప్రధాని మోదీ లోకో మాన్యుఫ్యాక్చరింగ్ షాప్-రోలింగ్ స్టాక్ వర్క్‌షాప్‌ను ప్రారంభించి, ఉద్యోగులతో సమావేశమయ్యారు. గుజరాత్‌లోని దాహోద్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ, ఆపరేషన్ సిందూర్ సైనిక చర్య కాదని అన్నారు. ఇది మన భారతీయుల సంస్కృతి, భావాల వ్యక్తీకరణ. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసే వారు మోడీతో పోటీ పడటం ఎంత కష్టమో కలలో కూడా ఊహించి ఉండరు. పిల్లల ముందే తండ్రిని కాల్చి చంపారు. ఈరోజు కూడా ఆ ఫోటోలు చూసినప్పుడు నా రక్తం మరిగిపోతుంది. ఇది 140 కోట్ల మంది భారతీయులకు సవాలు విసిరింది. కాబట్టి మోడీ దేశస్థులు అతనికి ఇచ్చిన పనిని చేశాడు. మోడీ తన త్రివిధ సైన్యాలకు స్వేచ్ఛా హస్తం ఇచ్చారు. మన సైన్యం గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచం చూడనిది చేసింది. సరిహద్దు వెంబడి పనిచేస్తున్న తొమ్మిది అతిపెద్ద ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఏప్రిల్ 22వ తేదీన పాక్ ఆడిన ఆటను మే 6వ తేదీ రాత్రి 22 నిమిషాల్లోనే మేము నాశనం చేసాము. కానీ పాకిస్తాన్ సైన్యం సాహసోపేతంగా వ్యవహరించినప్పుడు, మన సైన్యం పాకిస్తాన్ సైన్యాన్ని ఓడించింది అని మోడీ అన్నారు.

## కవిత లేఖ కలకలం.. కేసీఆర్ పై ఈటల షాకింగ్ కామెంట్స్



**హైదరాబాద్, :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. గులాబీ పార్టీలో ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈటల మాట్లాడుతూ, కేసీఆర్ ఒకరిపై నెగటివ్ అభిప్రాయం పెంచుకుంటే ఇక ఆయనను ఒప్పించటం అసాధ్యమని అన్నారు. కవిత విషయంలోనూ ఇదే జరిగింది అని భావిస్తున్నట్లు తెలిపారు. “కేసీఆర్ తనకు తాను చక్రవర్తిలా భావిస్తారు. ఆయనను ఎవరు ప్రశ్నించకూడదు, విమర్శించకూడదు. ఆయన మాటే శాసనం,” అని ఈటల వ్యాఖ్యానించారు. 20 ఏళ్ల పాటు కేసీఆర్‌తో పనిచేసిన అనుభవంతో మాట్లాడుతూ, “అయన పక్కన ఉండటం అంటే పూర్తిగా ఆయన్ని అనుసరించాల్సిందే. ఆయన్ను విమర్శించినవారిని ఆయన సహించరు. అతని పాలన రాచరికపు ధోరణిలో సాగుతుంది,” అని ఆరోపించారు. కేసీఆర్ నమ్మినవారినే అవసరమైనప్పుడు వాడుకుని తరువాత వదిలేస్తారని, ఇదే ఆయన రాజకీయం కుదించడానికి కారణమైందన్నారు. కవిత విషయంలో కుటుంబంలో ఏదో తేడా వచ్చి ఉండొచ్చని, మళ్లీ కలవడానికి అవకాశం లేదని ఈటల స్పష్టం చేశారు. ఈటల తనను కేసీఆర్ ఎందుకు దూరం చేసుకున్నారన్న అంశంపై మాట్లాడుతూ, “ఎవరో చెప్పిన మాటలపై నమ్మకంతోనే ఆయన నన్ను పక్కన పెట్టారు. ఇదే విధంగా హరీశ్ రావుతోనూ 2016 నుంచే ఇబ్బందులు నడుస్తున్నాయి,” అన్నారు. హరీశ్ రావు బీజేపీతో టచ్‌లో ఉన్నారని వస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, “అయన మాతో టచ్‌లో లేరు” అని స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రయోజనాలు కాపాడలేని ఆ పార్టీ ఎంపీలు రాజీనామా చేయాలి..



**హైదరాబాద్, :** సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూరు మండలం ఏపూరు గ్రామంలో ఐకేపీ కేంద్రంలో తడిసి మొలకెత్తిన ధాన్యం రాశులను పరిశీలించి, రైతులతో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా జలాలను సమర్థవంతంగా వాడుకున్నాం అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహకారంతో ఏపీ సీఎం చంద్రబాబు కృష్ణా జలాలను తరలించుకుని పోతున్నారని పేర్కొన్నారు. కృష్ణా జలాలను వాడుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కేఆర్ఎంబీ చెప్తుంది.. ఈడీ చార్జ్ షీట్ లో తన పేరు రాగానే సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని వద్దకు వెళ్లారు అని బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఇక, నీటి హక్కుల సాధన కోసం తెలంగాణ వాదులు, రైతులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలి అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ వద్ద పైరవీలు చేసుకునేందుకు.. చంద్రబాబు చుట్టూ తెలంగాణ నేతలు తిరుగుతున్నారు.. ఆంధ్ర రాష్ట్రం సాగు, నీటి ప్రాజెక్టులకు ప్రధాని పెద్దపీట వేస్తుంటే.. తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు నోరు మెదపడం లేదు అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడలేని భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు రాజీనామా చేయాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు.

## కాకాణికి రిమాండ్.. జైలుకు తరలింపు..




**అమరావతి,:** మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి రిమాండ్ విధించింది కోర్టు.. కాకాణిని వెంకటగిరి మేజిస్టేట్ ముందు హాజరుపరిచారు పోలీసులు.. ఈ నేపథ్యంలో వెంకటగిరిలో అప్రమత్తమైన పోలీసులు.. వెంకటగిరి కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశారు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు గూడూరు డీఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.. క్వార్జ్ అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా, నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాల వినియోగం, అభ్యంతరం వ్యక్తం చేసిన గిరిజనులపై బెదిరింపులకు దిగడం లాంటి తదితర అభియోగాలపై నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. దాదాపు 55 రోజులుగా పరారీలో ఉన్న కాకాణిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు.. అయితే, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి వచ్చేనెల తొమ్మిది వరకు రిమాండ్ విధించారు న్యాయమూర్తి.. దీంతో, వెంకటగిరి నుంచి నెల్లూరు సెంట్రల్ జైలుకి కాకాణిని తరలించారు పోలీసులు.

# రెడీ అవుతున్న భారత హై స్పీడ్ రైల్

### బుల్లెట్ రైలు వస్తోందీ..
### రూ.1,08,000 కోట్ల వ్యయం
### గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగం
### ముంబై టు సబర్మతి.. రెండు గంటల్లోనే
### 2028లో సాకారం కానున్న ప్రాజెక్టు
### పనుల్లో వేగం పెంచిన రైల్వే శాఖ



దేశీయ ప్రయాణికుల రవాణా వ్యవస్థలో వందే భారత్ రైలు ఒక పెద్ద ముందడుగు. సౌకర్యవంత ప్రయాణ అనుభూతికి ఈ రైలు ప్రసిద్ధి. గంటకు గరిష్ఠంగా 180 కిలోమీటర్ల వేగంతో కూడా ప్రయాణించగలదు. దీన్ని మించిన వేగంతో దూసుకుపోయే 'హై స్పీడ్ రైల్' కొద్దిరోజుల్లో పట్టాలెక్కనుంది. భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) ప్రాజెక్టు వేగం పుంజుకుంది. 2026 నాటికి పాక్షిక కార్యకలాపాలు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే 2028 నాటికి ప్రాజెక్ట్ పూర్తై బుల్లెట్ రైల్ దూసుకెళ్లనుంది. తద్వారా ప్రపంచంలో హై స్పీడ్ రైల్ వ్యవస్థ కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత్ నిలవనుంది. హైస్పీడ్ రైలు ప్రాజెక్టు కోసం 300 కి.మీ. వయాడక్టలు పూర్తయినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల తెలిపారు. ముంబై-అహ్మదాబాద్ కారిడార్ పొడవు 508 కిలోమీటర్లు. బుల్లెట్ రైలు గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనుంది. ముంబైలో మొదలై సూరత్, వడోదర, అహ్మదాబాద్ స్టాప్స్‌నకు పరిమితమైతే చివరి స్టాప్ అయిన సబర్మతికి 2 గంటల 7 నిమిషాల్లోనే ఈ రైలు చేరనుంది. అన్ని స్టాప్స్‌లోనూ ఆగితే 2 గంటల 58 నిమిషాల సమయం తీసుకుంటుంది. ఈ కారిడార్‌లో 12 స్టేషన్లు ఉన్నాయి. వీటిలో గుజరాత్‌లో ఎనిమిది, మహారాష్ట్రలో నాలుగు ఉన్నాయి. ముంబై స్టేషన్స్ భూగర్భంలో నిర్మిస్తుండగా మిగిలిన థానే, విరార్, బోయిసర్, వాపి, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి వద్ద ఎలివేటెడ్ స్టేషన్స్ రానున్నాయి.

### సముద్రగర్భ రైల్ టన్నెల్..

బుల్లెట్ రైలు కారిడార్‌లో 21 కిలోమీటర్ల పొడవైన సముద్రగర్భ రైల్ టన్నెల్ ప్రత్యేక ఆకర్షణ. ఇది ముంబై-థానే మధ్య ఏర్పాటవుతోంది. ఇందులో భారత్‌లోనే మొట్టమొదటి 7 కి.మీ. పొడవైన సముద్రగర్భ సొరంగం కూడా ఉంది. 13.1 మీటర్ల వ్యాసం కలిగిన ఒకే ట్యూబ్ సొరంగంలో రెండు ట్రాక్‌లు ఉంటాయి. ముంబై-అహ్ముదాబాద్ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టులో 465 కి.మీ. మేర ఎలిమేటెడ్ కారిడార్ ఉంటుంది. ప్రధానంగా ఫుల్ స్పాన్ లాంచింగ్ మెథడ్ ఉపయోగించి నిర్మిస్తున్నారు. వయడక్ట్ నిర్మాణంలో ఉపయోగించే సంప్రదాయ సెగ్మెంటల్ నిర్మాణ సాంకేతికత కంటే ఇది 10 రెట్లు వేగంగా ఉంటుంది. ఈ ప్రత్యేకమైన నిర్మాణ పద్ధతిని దేశంలో మొదటిసారిగా ఉపయోగిస్తున్నారు. ఈ సాంకేతికతను ఉపయోగించే, నైపుణ్యం సాధించిన ప్రపంచంలోని అతి కొద్ది దేశాలలో భారత్ ఒకటి.

### ట్రయల్ రన్ గుజరాత్‌లో..

ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్న నేషనల్ హై-స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకారం.. 383 కి.మీ. పీయర్ పనులు, 401 కి.మీ. ఫౌండేషన్, 326 కి.మీ. గర్డర్ క్యాస్టింగ్ కూడా పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.67,486 కోట్లు ఖర్చయ్యాయి. ప్రాజెక్టు పూర్తి అయ్యేసరికి వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉంది. 2026లో మొదటి ట్రయల్ రన్ గుజరాత్‌లో 50 కి.మీ.లో నిర్వహించనున్నారు. ఢిల్లీ-వారణాసి, చెన్నై-మైసూరు వంటి కారిడార్లలో హెచ్ఎస్ఆర్ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది. ముంబై-హైదరాబాద్, ఢిల్లీ-అహ్మ్మదాబాద్ కారిడార్లు పరిశీలనలో ఉన్నాయి.

### ఆటంకాలు దాటుకుని..

కోవిడ్-19 మహమ్మారి, మహారాష్ట్రలో భూసేకరణ, అనుమతుల జాప్యం.. వంటి కారణాలు బుల్లెట్ రైలు ప్రాజెక్టును రెండున్నరేళ్లు వెనక్కి నెట్టాయి. మౌలిక సదుపాయాలు, రోలింగ్ స్టాక్, సిగ్నలింగ్ వ్యవస్థ ఖరీదు భారం కావడం వంటి సవాళ్లను ఎదుర్కొంది. భారత రైల్వేల సొంత ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ అధీనంలో ఉన్న బీఈఎంఎల్‌ను సంయుక్తంగా 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రెండు ప్రోటోటైప్ రైలు సెట్లను (ఒక్కొక్కటి ఎనిమిది కార్లు) రూపొందించి తయారు చేయడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఆర్థిక సహాయంతోపాటు భారత్‌లో సమాచార సేకరణ, పరీక్షల కోసం రెండు షింకన్సెన్ రైళ్లను (జపాన్ బుల్లెట్ రైళ్లు) 2026 నాటికి జపాన్స్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్స్ ఏజెన్సీ (జికా) ఉచితంగా సరఫరా చేయనుంది. సిగ్నలింగ్ వ్యవస్థకు ప్రత్యామ్నాయాలను అందించేందుకు ఆల్‌స్టమ్-ఎల్అండ్‌టీ, డీఆర్ఏ-సీమెన్స్ ్ర జాయింట్ వెంచర్లు టెండర్ల కోసం బిడ్డింగ్ చేస్తున్నాయి.

### హెచ్ఎస్ఆర్‌గా పరిగణించాలంటే..

హై-స్పీడ్‌గా పరిగణించాలంటే రైళ్లు వాటి కోసం ప్రత్యేకంగా కేటాయించిన ట్రాక్‌లపై గంటకు 250 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వెళ్లాలి. సాధారణంగా వీటికి నూతన, ప్రత్యేకంగా రూపొందించిన మార్గాలు అవసరం. కొన్ని హెచ్ఎస్ఆర్ వ్యవస్థలు ప్రస్తుత నెట్‌వర్క్‌లోని కొంత ట్రాక్‌లను ఉపయోగిస్తాయి. అధిక వేగానికి తగ్గట్టుగా ట్రాక్‌లలో మార్పు, సిగ్నలింగ్‌ను మెరుగుపరచడం వంటివి చేయాల్సి ఉంటుంది. కఠిన భద్రతా ప్రమాణాలు, తగినంత విద్యుత్ సరఫరా, శిక్షణ పొందిన ఆపరేటింగ్ సిబ్బంది, మెరుగైన నిర్వహణ తప్పనిసరి.

### వాటి అనుభవాల నుంచి..

జపాన్, ఫ్రాన్స్ ్ర, జర్మనీతో సహా అభివృద్ధి చెందిన దేశాల్లో హై స్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఉంది. ప్రపంచంలో అతిపెద్ద హెచ్ఎస్ఆర్ నెట్‌వర్క్ ఉన్న దేశం చైనా. ఇండోనేషియా, ఉజ్బెకిస్తాన్ వంటి మధ్య ఆదాయ దేశాలు సైతం హెచ్ఎస్ఆర్ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికే హెచ్ఎస్ఆర్ నెట్‌వర్క్‌లను కలిగి ఉన్న దేశాల్లో పరిస్థితులపై పూర్తిస్థాయిలో మనం అధ్యయనం చేయాలి. అలాగే బుకింగ్స్ సమస్యలు (ఉజ్బెకిస్తాన్స్ ), భారీ నిర్వహణ వ్యయాలు (చైనా), శబ్ద కాలుష్యం (జపాన్స్ ) వంటి విషయాల్లో ఈ నెట్‌వర్క్‌లు ఎదుర్కొన్న విమర్శలపైనా దృష్టిపెట్టాలి. అప్పుడే మన బుల్లెట్ రైలు బ్రేకులు లేకుండా యమస్పీడుగా దూసుకెళ్తుంది.

### రూ.లక్ష కోట్ల ప్రాజెక్టు

ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,08,000 కోట్లు. ఇందులో 81 శాతం నిధులను జపాన్స్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్స్ ఏజెన్సీ (జికా) ద్వారా జపాన్స్ ప్రభుత్వం సమకూరుస్తోంది. ఈ ప్రాజెక్టులో రైల్వే మంత్రిత్వ శాఖకు 50 శాతం, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెరి 25 శాతం వాటా ఉంది. మొత్తం 1,389.5 హెక్టార్ల భూమిని సమీకరించారు.

# పగడపు దిబ్బలకు ముప్పు

### కూటమి విధ్వంస రచన
### సముద్ర పర్యావరణంపై పగబట్టిన ప్రభుత్వం
### సంపద సృష్టి కోసం సాగర తీరంలో పర్యాటక ప్రాజెక్టులు
### జీవ వైవిధ్యం కోసం పగడపు దీవుల్ని కాపాడుతున్న ఎన్జీవో సంస్థ ప్లాటిపస్
### పదేళ్లపాటు సంరక్షిస్తే సముద్ర తీర సంరక్షణ
### తిమ్మాపురం నుంచి మంగమారిపేట వరకు విస్తరించిన కోరల్ రీఫ్స్
### ఆ ప్రాంతంలోనే వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు ప్రభుత్వ కుట్ర
### పగడపుదిబ్బల రక్షణ కోసం పోరాటం చేస్తున్న ప్లాటిపస్ ప్రతినిధులు



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తీరంలో ఎక్కడా లేని విభిన్న పగడపు దిబ్బలకు చిరునామాగా ఉన్న విశాఖ తీరంలో విధ్వంసకాండకు తెరతీసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోంది. సంపద సృష్టి కోసం.. పర్యాటకం పేరుతో.. పర్యావరణంపై వేటు వేస్తున్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్లాటిపస్ ఎన్జీవో సంస్థ సముద్ర గర్భంలో పగడపు దీవుల్ని కాపాడుకుంటూ వస్తోంది. మరో పదేళ్ల పాటు వాటిని సంరక్షిస్తే.. మరింత విస్తరించి.. సాగరతీర స్వచ్ఛతతో పాటు.. కోతకు గురయ్యే ప్రమాదం నుంచి కాపాడవచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లుగా మంగమారిపేట తీరంలో వాటర్‌స్పోర్ట్స్‌కు టెండర్లు ఆహ్వానించి విధ్వంస రచనకు సంతకం చేస్తుండటంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగడపుదిబ్బల రక్షణ కోసం పోరాటం కొనసాగించేందుకు ప్లాటిపస్ సంస్థ ప్రతినిధులు నడుంబిగించారు. కోస్తా తీరంలో పగడపు దిబ్బలు అస్సలుండవని గతంలో అనేక సర్వేలు చెప్పినప్పటికీ, ఇటీవల జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధనలు ఆ వాదనను తప్పని నిరూపించాయి. విశాఖ సాగరతీరంలో విభిన్న రకాల కోరల్స్ (పగడపు దిబ్బలు) ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా మంగమారిపేట ప్రాంతంలో సాగరగర్భంలో విభిన్న పగడపు దిబ్బలు ఉన్నట్లు అన్వేషణలో తేలింది. దీని వెనుక ప్లాటిపస్ ఫౌండేషన్ కృషి ఎంతో ఉంది. తిమ్మాపురం, రుషికొండ, మంగమారిపేట మొదలైన ప్రాంతాల్లో నిరంతరం సాగరగర్భ స్వచ్ఛత కోసం ఈ సంస్థ ఏళ్ల తరబడి శ్రమిస్తోంది. సముద్రపు లోతుల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను ఇప్పటివరకు 2 లక్షల 60 వేల కిలోల వరకు తొలగించారు. అక్కడ ఉన్న పగడపు దిబ్బలను సంరక్షిస్తూ వాటి అభివృద్ధి కోసం స్కూబా డైవర్లతో కలిసి నిరంతరం కృషి చేయడంతో మంగమారిపేట, తిమ్మాపురం ప్రాంతాల్లో ఇవి విస్తరించాయి. స్కెలరాక్టినియా కోరల్స్, పవోనా ఎస్పీ, లిథోఫిలాన్ ఎస్పీ, మోంటీపోరా ఎస్పీ, పోరిటెస్ ఎస్పీ, హెక్సాకోరిలియా, ఆక్టోకోరలియా, డిస్కోసోమా, లోబాక్టిస్ వంటి అరుదైన పగడపు దిబ్బలు విస్తారంగా ఉన్నాయి.

### జీవవైవిధ్యానికి ప్రతిరూపాలు

ఈ కోరల్స్ ద్వారా సముద్ర జీవజాలాన్ని సంరక్షించుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సముద్ర గర్భంలో పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలుగా పగడపు దిబ్బలను పిలుస్తారు. పగడాల ద్వారా స్రవించే కాల్షియం కార్బోనేట్ నిర్మాణాల వల్ల ఇవి ఏర్పడతాయి. ఇవి అనేక పోషకాలను కలిగి ఉంటాయి. పగడపు దిబ్బలు సముద్రగర్భంలో అత్యంత వైవిధ్యమైన పర్యావరణ వ్యవస్థలను ఏర్పరుస్తాయి. ఇవి ఉంటే సముద్ర జీవరాశులు ఎక్కువగా వృద్ధి చెందడానికి ఉపయోగపడతాయి. సముద్రంలోని చేపలతో పాటు 25 శాతం జీవులకు సముద్ర వర్షారణ్యాలు అని పిలిచే పగడపు దిబ్బలే ఆవాసాలు. రంగురంగుల చేపల నుంచి గంభీరమైన సముద్ర తాబేళ్ల వరకు లెక్కలేనన్ని జాతులకు ఇవి కీలకమైన ఆశ్రయం, సంతానోత్పత్తి ప్రదేశాలుగా మారి ఆహార వనరులను అందిస్తాయి. చేపలు, మొలస్కా, ఇతర జీవజాతులు, క్రస్టేసియన్లు, స్పాంజ్‌లు మొదలైన సముద్ర జాతుల ఉత్పత్తి పెరిగేందుకు ఇవి అనువైన వాతావరణాన్ని అందిస్తాయి.

### 'కూటమి'కాసుల కక్కుర్తికి బలి.!

తీరప్రాంత నిర్మాణాలు పెరగడం, ఉష్ణోగ్రతలు పెరగడం కారణంగా ఇప్పటికే 33 శాతం పగడాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. వాతావరణ మార్పులు, విధ్వంసకర మానవ చర్యల వల్ల వీటి మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. తీరప్రాంతాన్ని రక్షించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ప్లాటిపస్ సంస్థ ఈ పగడపు దిబ్బలను సంరక్షిస్తోంది. అయితే ఇలాంటి అరుదైన ప్రాంతంపై ఇప్పుడు కొందరు కూటమి నేతల కన్ను పడింది. సంపద సృష్టి పేరుతో తిమ్మాపురం నుంచి మంగమారిపేట వరకు ఆక్వా స్పోర్ట్సును అభివృద్ధి చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. వాస్తవానికి ఈ ప్రాంతం వాటుర్‌స్పోర్ట్స్‌కు అనువుగా లేకుపోయినా కేవలం కొన్ని సంస్థలుకు భూములు కట్టబెట్టేందుకే పర్యాటక శుఖ ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఆరోపణులు వస్తున్నాయి. టూరిజం మంత్రి అండదండలున్న ఒక సంస్థ కోసం పగడపు దిబ్బలును నాశనం చేసేందుకు సిద్ధమవుతున్నారని పుర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చుస్తున్నారు. అయితే పగడపు దిబ్బలను సంరుక్షించేందుకు ప్లాటిపస్ ఫౌండేషన్ సంస్థ పోరాటానికి సిద్ధమైంది. ఈ ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్ వద్దని, వాటిని వేరే ప్రాంతానికి తురులించాలని వారు అధికారులను కోరుతున్నారు.

### పదేళ్లపాటు సంరక్షించుకోవాలి

కొన్ని తీర ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించి ఆక్వా స్పోర్ట్స్ అభివృద్ధి కోసం ప్రయత్నించడం మంచి పరిణామమే. కానీ అత్యంత అరుదైన, జీవవైవిధ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేసే పగడపు దిబ్బలు ఉన్న ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయడం మాత్రం తగదు. గత కొన్నేళ్లుగా మంగమారిపేట ప్రాంతంలో కోరల్ రీఫ్స్‌ను పెంచుతూ వస్తున్నాం. వీటిని మరో పదేళ్లపాటు సంరక్షించుకుంటే ఈ ప్రాంత సముద్ర తీరం మరింత ఆహ్లాదకరంగా మారుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నాం

# దేశంలో 26,367 ఈవీ పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు




దేశవ్యాప్తంగా విద్యుత్ వాహనాల (ఈవీ) అమ్మకాలతోపాటు.. వాటి విద్యుత్ వినియోగమూ పెరుగుతోంది. 2024-25లో రికార్డు స్థాయిలో సుమారు 19.65 లక్షల ఈవీలు వినియోగదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఈవీల కోసం ఏర్పాటుచేస్తున్న పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు (పీసీఎస్) కూడా గత మూడేళ్లలో భారీగా పెరిగాయి. కేంద్ర విద్యుత్ సంస్థ (సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ -సీఈఏ) తాజా నివేదిక ప్రకారం.. ఈ స్టేషన్లలో చార్జింగ్ కోసం 2024-25లో వినియోగించిన విద్యుత్ 847 మిలియన్ యూనిట్లు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 82 శాతం అధికం కావడం గమనార్హం. పీసీఎస్‌లు వినియోగించిన విద్యుత్ విషయంలో తెలుగు రాష్ట్రాలు టాప్ - 7 జాబితాలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా.. ఈవీల కోసం ఏర్పాటుచేసిన పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లలో (పీసీఎస్) దేశవ్యాప్త విద్యుత్ వినియోగం 2024-25లో 847.8 మిలియన్ యూనిట్లకు (ఎంయూ) చేరుకుంది. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 82 శాతం ఎక్కువ. 2024 ఏప్రిల్ నెలలో వినియోగం 52.88 ఎంయూలు కాగా, 2025 మార్చిలో ఇది 60.7 శాతం పెరిగి 85 ఎంయూలకు చేరింది.

### తెలంగాణ 5.. ఏపీ ఏ7

కేంద్ర విద్యుత్ సంస్థ నివేదిక ప్రకారం పీసీఎస్‌లు వినియోగించే విద్యుత్‌లో ఢిల్లీ 38.69 శాతం వాటాతో ముందంజలో ఉంది. విస్తీర్ణంలో చిన్నదైనప్పటికీ, పీసీఎస్‌ల అధిక విద్యుత్ వినియోగానికి కారణం.. రాజధానిలో ఈవీల అమ్మకాలు దూసుకెళ్లడమే. మహారాష్ట్ర 25.57 శాతం, కర్ణాటక 9.39, గుజరాత్ 7.56 శాతాలతో ఆ తరువాతి స్థానాల్లో నిలిచాయి. తెలంగాణ 5వ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ 7వ స్థానంలోనూ నిలిచాయి. టాప్ - 4 మినహాయిస్తే.. మిగతా రాష్ట్రాలన్నీ కలిపి 18.78 శాతం విద్యుత్‌ను వినియోగించాయి.

### ఏటా 50,000 స్టేషన్లు

భారత్‌లో 2025 ఏప్రిల్ 1 నాటికి ఉన్న ఈవీల పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య 26,367. 2022 డిసెంబరుతో పోలిస్తే.. 2024 డిసెంబరు నాటికే వీటి సంఖ్య సుమారు ఐదింతలు కావడం విశేషం. కర్ణాటకలో అత్యధిక సంఖ్యలో 5,880 కేంద్రాలు ఉన్నాయి. మహారాష్ట్రలో 3,746, ఉత్తరప్రదేశ్‌లో 2,137, ఢిల్లీలో 1,951, తమిళనాడులో 1,524 స్టేషన్స్ పనిచేస్తున్నాయి. తెలంగాణలో 976, ఆంధ్రప్రదేశ్‌లో 616 స్టేషన్స్ ఉన్నాయి. 2030 నాటికి ప్రైవేట్ వాహనాల్లో 30 శాతం, వాణిజ్య వాహనాల్లో 70 శాతం, బస్సుల్లో 40 శాతం, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల్లో 80 శాతం ఎలక్ట్రిక్‌వే ఉండాలని నీతి ఆయోగ్ లక్ష్యంగా నిర్దేశించింది. దీనికి అనుగుణంగా చార్జింగ్ నెట్‌వర్క్‌ను ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆరేళ్లలో ఏటా దాదాపు 50,000 చార్జింగ్ పాయింట్ల చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ వెల్లడించింది.

### త్రీ వీలర్ల అమ్మకాల్లో నం.1

ఈవీల అమ్మకాల్లో భారత్‌లో రికార్డుల పరంపర కొనసాగుతూనే ఉంది. 2024-25లో 17 శాతం వృద్ధితో 19,64,831 యూనిట్ల ఈవీలు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి. ఇందులో టూ వీలర్స్ గతేడాదితో పోలిస్తే 21 శాతం పెరిగి 11,49,307 యూనిట్లు, త్రీ వీలర్స్ 10శాతం అధికమై 6,99,062 యూనిట్లను తాకాయి. 1,07,462 ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు జరిగాయి. ఎలక్ట్రిక్ త్రి చక్ర వాహనాల అమ్మకాల్లో రెండేళ్లుగా భారత్ ప్రపంచంలో నంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. చైనా గత ఏడాది 3,00,000 ఎలక్ట్రిక్ త్రీవీలర్స్‌ను విక్రయించింది. ఈ-కామర్స్, క్విక్ కామర్స్ సంస్థలు సరుకు డెలివరీ కోసం ఈవీలను ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. దీంతో ఈ విభాగంలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు అధికంగా అమ్ముడవుతున్నాయి. 2032 నాటికి 12.3 కోట్ల ఈవీలు భారతీయ రోడ్లపై పరుగు తీస్తాయని ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్, కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ సంయుక్త నివేదిక వెల్లడించింది. 2013-14 నుంచి 2025 మార్చి వరకు భారత్‌లో 59.25 లక్షల యూనిట్ల ఈవీలు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం 44 లక్షలు రోడ్లపై పరుగుతీస్తున్నాయి.

### 2.5 నుంచి 3.5 రెట్లు

తెలంగాణలో ఈ ఏడాది ఒక రోజులో నమోదైన గరిష్ఠ విద్యుత్ వినియోగం దాదాపు 339 ఎంయూ. అదే ఆంధ్రప్రదేశ్‌లో తీసుకుంటే సుమారు 240 ఎంయూ. అంటే తెలుగు రాష్ట్రాల ఒక రోజు విద్యుత్ వినియోగంతో పోలిస్తే సుమారు 2.5 నుంచి 3.5 రెట్లు ఎక్కువ విద్యుత్తును.. 2024-25లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు వినియోగించాయన్నమాట.

### ఈవీలు - చార్జింగ్ స్టేషన్లు

గత ఆర్థిక సంవత్సరంలో అమ్ముడైన ఈవీలు సుమారు 19.65 లక్షలు 2022 డిసెంబరు నాటికి దేశవ్యాప్తంగా ఉన్న ఈవీ పబ్లిక్ చార్జింగ్ స్టేషన్స్ 5,151 2022 డిసెంబరు నాటికి దేశవ్యాప్తంగా ఉన్న ఈవీ పబ్లిక్ చార్జింగ్ స్టేషన్స్ 5,151 ప్రస్తుతం తెలంగాణలో 976, ఏపీలో 616 కేంద్రాల 2013-14 నుంచి 2024-25 మధ్య అమ్ముడైనవి 59.25 లక్షల యూనిట్లు ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి 44 లక్షలు

సూర్య

సంపాదకీయం

## మావోయిస్టుల గమ్యం, గమనం!

### (విశ్లేషణ)

'అవును. వాళ్ళు మరణిస్తారు. వీళ్ళంటున్న ఈ ఆఖరి యుద్ధంలో చిట్టచివరి వీరుడూ నేలకొరిగాక ఎప్పుడో చేసుకున్న ఒప్పందాల దస్త్రాలు దుమ్ము దులిపి బయటకు తీస్తారు. ఆదివాసుల్ని వాళ్ళ నేలనుండే బహిష్కరిస్తారు. వెళ్ళని వాళ్ళని ఎప్పటిలానే, చరిత్ర పొడుగుతా జరిగినట్లుగానే గూడేలకు గూడేలు తగలబెడతారు. ఈ మారణకాండను చూసిన చెట్లు ఎక్కడ సాక్ష్యం చెబుతాయోనని వేర్లతోసహా పెకలించివేస్తారు. ముక్కలై మాంసంలో కలిసి ఎగుమతైన స్పార్టకస్ అంశతో ఎవడో పుడతాడు. భగత్ సింగ్ పక్కింట్లో పుడతాడు. నల్లా ఆదిరెడ్డో, నంబాల కేశవరావో ఎవడో ఒకడు. స్వర్ణక్కో, రేణుకో, పద్మో ఎవరో ఒకరు. మళ్ళీ వచ్చారా%ొ% వీళ్ళది పోరాటమంటే.. అని నలుగురం కూడి చీర్స్ చెప్పుకుంటూ వాళ్ళ పోరాటాన్ని మాట్లాడుకుందాం. తల ఉందంటే తెగి పడుతుంది. వెన్నెముక నిటారుగా ఉంటే విరిగిపోతుంది' అని మావోయిస్టు పార్టీ అభిమాని ఒకరు మే 22 న సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టాడు. కాగా 'ఒక అధ్యాయం ఇక ముగిసినట్లే.నూతన అధ్యాయం ఎలా ఉంటుందో కాలమే సమాధానం చెబుతుంది' అని ఒక మాజీ మావోయిస్టు పార్టీ నాయకుడు ఒకరు అన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్ కౌంటర్ వార్త గుప్పుమనగానే ఆయన తక్షణ స్పందన ఇది! 'భారత సైనిక బలగాలు అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో మావోయిస్టులపై పైచేయి సాధించవచ్చు కానీ, వాళ్ళు ప్రజల్ని జయించినట్టు కాదు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. కాగా కేవలం అడవులకు మాత్రమే మనం ఎందుకు పరిమితమయ్యామో ఆలోచించుకోవాలి అని మావోయిస్టు పార్టీ సిద్ధాంత కర్తలలో ఒకరైన కోబాడ్ గాంధీ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. నిజమే! ఆయన మాటలను మావోయిస్టు పార్టీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవలసిందే. 'పోరాటంతో ఆటలాడొద్దు. మీ ఆటల పర్యవసానాలను ఎదుర్కొనే సంసిద్ధత లేకపోతే అసలు విప్లవంతో ఆటలాడొద్దు. విప్లవం అంటే ప్రతిరోజూ మారిపోయే అనంతమైన పరిణామాలను గణించే విధానం. మిమ్మల్ని వ్యతిరేకించే రాజ్యానికి అధికారం, సైనిక బలం పుష్కలంగా ఉన్నాయి. మీరు అంతకన్నా బలంగా లేకపోతే ఓడిపోతారు. నశించిపోతారు' అని మార్క్ 'న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్' లో ఒక వ్యాసంలో వివరించారు. 'రాజకీయ వ్యూహం, దానికి అనుగుణంగా ఉండే మిలిటరీ ఎత్తుగడలు రెండింటిలోనూ తప్పులు జరిగాయి. 1920-1940 మధ్య చైనాలో విజయవంతమైన వ్యూహాన్ని మావోయిస్టులు అనుసరిస్తున్నారు. ఆ వ్యూహం మొత్తం దేశానికి ఆపాదించలేం. భారతదేశంలో వ్యవసాయ సమాజం, ఆర్థిక రంగం రెండూ బహుముఖాలుగా చీలిపోయి ఉన్నాయి. మావో రూపొందించిన వ్యూహం మన దేశంలో కూడా విజయవంతమవుతుందన్న ఊహల్లోనే మావోయిస్టు పార్టీ నాయకత్వం ఉండిపోయింది. చైనాలో కామ్రేడ్లు జరిపిన పోరాటం కంటే, భిన్నమైన పరిస్థితుల్లో, భిన్నమైన పోరాటం తాము జరుపుతున్న వాస్తవాన్ని విప్లవకారులు తెలుసుకోవాలి' అని నక్సలైట్ ఉద్యమ విశ్లేషకుడు, చరిత్రకారుడు సమంత బెనర్జీ ఒక వ్యాసంలో అన్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును మే 21న ఎన్‌కౌంటర్ చేయడంతో నక్సలైట్ నాయకత్వం పతనం అంచున ఉన్నట్టు కనబడుతోంది. కొద్దిమంది పోలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు మాత్రమే చురుకుగా ఉన్నట్టు తాజాగా ఐ.బి వర్గాల అంచనా. రామన్న, హరిభూషణ్, రామకృష్ణ, కటకం సుదర్శన్ వంటి ప్రధాన నాయకులు అనారోగ్యం కారణంగా మరణించారు. లేదా ఎన్‌కౌంటర్లకు బలయ్యారు. సీనియర్ నాయకుడు చలపతి ఇటీవల గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. జార?ండ్‌కు చెందిన అగ్రశ్రేణి నాయకుడు ప్రశాంత్ బోస్‌ను అరెస్టు చేశారు. ఈ ఎదురు దెబ్బలతో నక్సలైట్ నెట్‌వర్క్ చావుదెబ్బ తిన్నది. కీలకమైన నక్సలైట్ నాయకుల కదలికలను ట్రాక్ చేయడానికి భద్రతా దళాలు డ్రోన్‌లు, ఉపగ్రహ ఇమేజింగ్, ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపయోగిస్తున్నది.మావోయిస్టు నాయకుల చుట్టూ ఉచ్చు బిగించడానికి సిఆర్‌పిఎఫ్ బెటాలియన్లు, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ యూనిట్లను బలోపేతం చేశారు. మావోయిస్టులకు ఆర్థిక, లాజిస్టికల్ మద్దతు వ్యవస్థ దాదాపు స్తంభించిపోయింది. నిధుల కొరత, కీలక నాయకుల ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు ఉద్యమ ప్రభావాన్ని బలహీనపరిచాయి. 'శత్రువు బలం ఎక్కువగా ఉండి, నీ బలం తక్కువగా ఉన్నప్పుడు, నీ బలమైన ప్రాంతాల్లో నీకున్న శక్తులన్నీ కూడగట్టుకొని శత్రువుకు చెందిన చిన్న చిన్న విభాగాలపై బలమైన మెరుపుదాడులు చేసి విజయాలు సాధించాలి' అనేది మావో చెప్పిన గెరిల్లా యుద్ధవ్యూహాల్లో ఒకటి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో జరుపుతున్న దాడులతో మావోయిస్టుల 'బలమైన' ప్రాంతాల్లోనూ కదిలే పరిస్థితిలేని కట్టడి కనిపిస్తోంది. మావోయిస్టులపై కేంద్ర బలగాల తుది పోరాటం అత్యంత కీలకమైన దశలో ఉంది. బిజెపి అనుబంధ సంస్థ సొంత పత్రిక 'ఆర్గనైజర్' కథనాన్ని బట్టి, గ్రామీణ, మారుమూల, అడవులు, కొండ, కోనల్లో మావోయిస్టుల సాయుధ గెరిల్లా దళాలను తుదముట్టించే 'ఆపరేషన్ కగార్'కు సమాంతరంగా, మావోయిస్టుల రాజకీయ అభిప్రాయాలను సమర్థించే వాళ్ళను ఏరివేసే చర్యలు కూడా ముమ్మరం కావచ్చు. పట్టణాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, మేధావులు, పౌరహక్కుల కార్యకర్తలు, కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, ఇతర ప్రజాసంఘాల కదలికలపై నిఘా తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. రాడికల్ విద్యార్థి, యువజన సంఘాలు, సికాస వంటి సంఘాలలో ఇదివరకు పనిచేసి ప్రస్తుతం వివిధ నగరాల్లో, రాష్ట్రాల్లో, విదేశాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వ్యక్తుల కార్యకలాపాలపైనా నిఘా పెంచనున్నారని తెలియవచ్చింది. 'కేంద్ర ప్రభుత్వ భద్రతాసంస్థల అధ్యయనాలలో అర్బన్ నక్సలిజం నాల్గవ తరం యుద్ధం (4 వ జనరేషన్ ) పరిధిలోకి వస్తుంది. నక్సలిజం పరిధి కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితంకాదని అర్థం చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో పని అనేది మావోయిస్టు వ్యూహంలో ఒక భాగం, దీనిని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ 2004లో జారీ చేసిన 'అర్బన్ పెర్స్పెక్టివ్', 'భారత విప్లవ వ్యూహాలపై' పత్రాలలో విస్తృతంగా వివరించింది. పట్టణ ప్రాంతాల్లో నక్సల్ కార్యకలాపాలపై దృష్టి సారించే పత్రంలోని విభాగాలు భారతదేశంలో అర్బన్ నక్సలిజం సైద్ధాంతిక చట్రాన్ని అందిస్తాయి. ప్రజాయుద్ధానికి, విముక్తి పొందిన ప్రాంతాల స్థాపనకు అవసరమైన వివిధ రకాల సామర్థ్యాలను కలిగి ఉన్న కార్యకర్తలు, నాయకత్వాన్ని అందించే ప్రధాన వనరులలో పట్టణ ఉద్యమం ఒకటి అని వారి పత్రాలు స్పష్టంగా చెబుతున్నాయి%ొ% అంతేకాకుండా, ప్రజా యుద్ధానికి సరఫరాలు, సాంకేతికత- నైపుణ్యం, సమాచారం, ఇతర వస్తువులను అందించే బాధ్యత కూడా పట్టణ విప్లవ ఉద్యమం భుజాలపైనే ఉంది. 2015- 16లో ఎఫ్‌టిఐఐ, హెచ్‌సియు, ఐఐటి చెన్నై, జెఎన్‌యు, ఉస్మానియా, జాదవ్‌పూర్, ఢిల్లీ విశ్వవిద్యాలయం వంటి ప్రఖ్యాత విద్యా సంస్థల క్యాంపస్‌లలో భారత జాతి విచ్ఛిన్నతను సమర్థించే నినాదాలు తరచూ ప్రతిధ్వనిస్తున్నట్టు ఒక నివేదికను ఇంటెలిజెన్స్ బ్యూరో కేంద్రానికి అందజేసినట్టు సమాచారం అందుతోంది. అర్బన్ నక్సల్స్ గ్రామీణ ప్రాంతాల్లోని మావోయిస్టులకు ఆయుధాలు, ఔషధాలు, కమ్యూనికేషన్ పరికరాలు వంటి ముఖ్యమైన వస్తువులను సరఫరా చేయడం ద్వారా మద్దతు ఇస్తున్నట్టు ఆ నివేదికలో తెలిపారు. అదే సమయంలో కొన్ని 'కవర్ ఆర్గనైజేషన్స్'ను ఏర్పాటు చేసి, దళ సభ్యులుగా తయారు చేస్తున్నట్టు కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలంటున్నవి. తమ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి ఇంటర్నెట్, సోషల్ నెట్‌వర్క్‌లను అర్బన్ నక్సలైట్లు వాడుతున్నట్టు ఆ వర్గాలు చెబుతున్నవి. 'సైనిక, పారామిలిటరీ దళాలు, పోలీసులు, రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలోని ఉన్నత స్థాయిలలోకి చొచ్చుకుపోవాలి. శత్రువు గురించి సమాచారాన్ని సేకరించాలి. ఆయా వ్యవస్థలలో విప్లవానికి మద్దతును కూడగట్టాలి. సమయం వచ్చినప్పుడు తిరుగుబాటును ప్రేరేపించాలి' అని పట్టణ ప్రాంతాల్లోని మేధావులు, రచయితలకు నిర్దేశిస్తున్నట్టుగా మావోయిస్టు పార్టీకి చెందిన ఒక 'వ్యూహ పత్రం'లో బయటపడినట్టు కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థలు చెబుతున్నాయి.

# కేరళ సముద్ర తీరంలో డేంజర్ బెల్...!
# మునిగిపోయిన ఆ కంటైనర్ షిప్పులో ఏముంది?

కేరళ కోచి తీరంలో రెడ్ అలర్ట్. అక్కడి సముద్ర జలాలు విషతుల్యం కాబోతున్నాయి. సముద్ర జీవుల మనుగడే ప్రశ్నార్థకం కాబోతోంది. కారణం..ఓ ఓడ. శనివారం సాయంత్రం లెబీరియాకు చెందిన ఓభారీ నౌక మునిగిపోయింది. ఆనౌకలో ఉన్న కంటైనర్లన్నీ సముద్రంలో మునిగిపోయాయి. ఇప్పుడు ఆందోళన మునిగిన ఓడగురించో..లేక కంటైనర్ల మునిగడంతో వచ్చిన నష్టం కాదు..కంటైనర్లలో ఉన్న ప్రమాదకరమైన రసాయనాలు సముద్రంలో కలిశాయి. ఆరసాయనాలు ఎంతమోతాదులో సముద్రజలాలను విషతుల్యం చేశాయో ఇంకా తెలియరాలేదు కానీ.. ప్రమాదం మాత్రం ఊహించనంత ఉండబోతోందన్న టెన్షన్ పట్టుకుంది కేరళ తీరప్రాంతవాసులకు. అటు అధికారులకు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు.. ఇంతకూ భయపడేంత డేంజర్ కెమికల్ ఆ ఓడలో ఏముంది.. లైబీరియాకు చెందిన MSC ELSA 3 కార్గో నౌక.. శనివారం సాయంత్రం కొచ్చికి రావాల్సి ఉంది. అయితే నిన్న సాయంత్రం వాతావరణం అత్యంత ప్రమాదకరంగా ఉంది. అరేబియా సముద్రంలో భారీ తుఫాను, ఈదురుగాలులు ఆఓడను చుట్టుముట్టాయి. కొచ్చికి 38నాటికల్ మైళ్లదూరంలో ఓడ భయంకరమైన తుఫానులో చిక్కుకుపోయింది. సాయంత్రం 4.30గంటలకు ఒక్కసారిగా ఈదురుగాలుల తీవ్రతకు ఓ పక్కకు ఒరిగిపోయింది. వెంటనే నౌక సిబ్బంది మన ఇండియన్ కోస్ట్‌గార్డ్స్‌కు సమాచారం అందించారు. వెంటనే అలర్ట్ అయిన మన కోస్ట్‌గార్డ్ INSసుజాతతో ఓడలోని సిబ్బందిలో 18మందిని రక్షించి..తీరప్రాంతానికి తీసుకొచ్చింది. ఇంకా ముగ్గురు షిప్‌లోనే చిక్కుకుపోయారు. బలమైన ఈదురుగాలలకు రెస్క్యూ ఆపరేషన్‌కు తీవ్ర అడ్డంకిగా మారాయి. ఈదురుగాలలుకు షిప్‌లోని కంటైనర్లు ఒక్కొక్కటిగా సముద్రంలో పడసాగాయి. రాత్రి 9గంటలకు ఓడ పూర్తిగా సముద్రంలో మునిగిపోయే పరిస్థితికొచ్చింది. దీంతో మిగతా ముగ్గురిని అతికష్టం మీద ఇండియన్ కోస్ట్‌గార్డ్స్ రక్షించగలిగారు. రాత్రి 11గంటల వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. మొత్తం ఓడలో 24మంది సిబ్బంది ఉన్నారు. ఓడ మునిగిపోవడానికి ప్రధాన కారణం వాతావరణ పరిస్థితులేనని భారత వాతావరణ శాఖ తెలిపింది. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రతరమై, గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఈ పరిస్థితుల్లో ఓడ సిబ్బంది నియంత్రణ కోల్పోయారు. ఓడలో ఉన్న 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ సముద్రంలో పడిపోయింది. కార్గో నౌకలో మొత్తం 640 కంటైనర్లు ఉన్నాయి. అందులో 13కంటైనర్లలో ప్రమాదకర రసాయనాలు ఉన్నాయి. వీటిలో 12కంటైనర్లలో కాల్షియం కార్బైడ్ ఉంది. రెస్క్యూ ఆపరేషన్స్ రక్షణ కార్యక్రమాలు



కొనసాగుతున్నాయి. సముద్రంలో చెల్లాచెదురుగా ఉన్న కంటైనర్లను సేకరించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. కంటైనర్లలోని ప్రమాదకర రసాయనాల్లో కాల్షియం కార్బైడ్ ప్రధానమైనది. ఇది నీటితో కలిసినప్పుడు అసిటిలీన్ వాయువును విడుదల చేస్తుంది, ఇది అత్యంత మండే స్వభావం గలది. అసిటిలీన్ గాలిలో ఉన్నప్పుడు పేలుడు సంభవించే అవకాశం ఉంది. కొన్ని రకాల చేపలు, పగడాలు చనిపోయే ప్రమాదం ఉంది. ఈ రసాయనం తీరప్రాంత గ్రామాలకు వ్యాపిస్తే..స్థానికులకు శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులు సంభవించవచ్చు. మిగిలిన కంటైనర్‌లోని రసాయనం గురించి కచ్చితమైన వివరాలు లేనప్పటికీ, అది కూడా పర్యావరణానికి హానికరమైనదని అధికారులు ధ్రువీకరించారు.కంటైనర్లు మునిగిపోవడంతో%ొ%సముద్రాన్ని శుద్ధి చేయడం కష్టంగా మారింది. రసాయనాలు నీటితో కలిస్తే సముద్ర జీవులు చనిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.ఓడ మునిగిపోవడంతో నష్టం తీవ్రంగా ఉంటుందని అంచనా. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఓడ, కంటైనర్ల నష్టం, రసాయన కాలుష్య శుద్ధికి సుమారు 500 కోట్ల రూపాయల వరకు ఖర్చు అవుతుందని నిపుణులు తెలిపారు. సముద్రంలో లీకైన డీజిల్, ఫర్నేస్ ఆయిల్ వల్ల మత్స్య సంపదపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటుంది. ఓడ మునిగిన ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణకు ఆదేశించాయి. ఓడ నిర్వహణలో లోపాలు, రసాయన కంటైనర్ల భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలపై విచారణ చేయనున్నారు. కేరళ తీరంలో ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించారు.ప్రస్తుతం తీరప్రాంత గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేసారు. జనం కంటైనర్లను తాకకుండా ఉండాలని సూచించారు.

# జర్మనీ సంచలన నిర్ణయం..
# రష్యాకు హెచ్చరికగా 5,000 మంది సైనికుల మోహరింపు

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో నాటో కూటమి తన తూర్పు సరిహద్దులను బలోపేతం చేసుకోవడంలో భాగంగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జర్మనీ సైన్యం చరిత్రలోనే ఒక భారీ ప్రాజెక్టును చేపట్టింది. దాదాపు 5,000 మంది జర్మన్ సైనికులను లిథువేనియాలో శాశ్వతంగా మోహరించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఏప్రిల్ 1న లిథువేనియా రాజధాని విల్నియస్‌లో కొత్త పాన్జర్ బ్రిగేడ్ 45 అధికారికంగా ప్రారంభమైంది. రష్యా దూకుడుకు వ్యతిరేకంగా NATO తూర్పు సరిహద్దును సురక్షితం చేయడానికి జర్మనీ ఈ చర్య తీసుకుంది. జర్మనీ సైన్యం గతంలో ఎనిమిది బ్రిగేడ్‌లతో ఉండేది. ఇప్పుడు లిథువేనియాలో మోహరించబడిన తొమ్మిదో బ్రిగేడ్ ఇది. బుండెస్వెహర్ చరిత్రలో ఒక విదేశీ గడ్డపై సైన్యాన్ని శాశ్వతంగా మోహరించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలకు చిహ్నంగా పాన్జర్ బ్రిగేడ్ 45 చిహ్నంలో విల్నియస్ నగరంలోని ప్రముఖ కట్టడం గెడిమినాస్ టవర్ ను కూడా చేర్చారు. సైనికులు తమ యూనిఫామ్‌లపై ఈ చిహ్నాన్ని ధరిస్తారు. జర్మన్ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ రెండు వారాల క్రితం కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత బుండెస్టాగ్ (పార్లమెంట్)లో తన మొదటి ప్రసంగంలో ఈ నిర్ణయం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. నాటో భూభాగంలో ప్రతి అంగుళాన్ని రక్షించడానికి జర్మనీ సిద్ధంగా ఉంటుందని ఆయన ప్రతిజ్ఞ చేశారు. 3 మిలియన్ల జనాభా కలిగిన లిథువేనియా, రష్యాకు చెందిన కాలినిన్‌గ్రాడ్ ఒబ్లాస్ట్, రష్యా మిత్రదేశమైన బెలారస్‌ల మధ్య ఉంది. బెలారస్‌తో దాదాపు 680 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుంది. లిథువేనియా ప్రభుత్వం కూడా తమ సైనిక శక్తిని బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా జర్మనీలో తయారైన 44 ఆధునిక లియోపార్డ్ 2 A8 ప్రధాన యుద్ధ ట్యాంకులను ఆర్డర్ చేసింది. ఇదే ట్యాంక్‌లను లిథువేనియాలో మోహరించిన బుండెస్వెహర్ బ్రిగేడ్ కూడా ఉపయోగించనుంది. ఇది రెండు సైన్యాల మధ్య సహకారాన్ని సులభతరం చేస్తుంది. రక్షణ మంత్రి పిస్టోరియస్ 2023 వేసవి నుంచి ఈ బ్రిగేడ్ ఏర్పాటును వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం, బ్రిగేడ్ సిబ్బంది, ప్రారంభ సహాయక యూనిట్లు మాత్రమే అక్కడ ఉన్నాయి. అయితే, ఈ సంవత్సరం చివరి నాటికి మొత్తం 500 మంది జర్మన్ సైనికులు లిథువేనియాలో మోహరిస్తారు. బ్రిగేడ్ ప్రధాన స్థావరమైన రుడ్నిన్‌కై సైనిక శిక్షణా ప్రాంతంలో కీలకమైన మౌలిక వసతులను ఇంకా



నిర్మిస్తున్నారు. బ్యారక్‌లు, కొత్త రహదారులు, ఆగ్నేయ లిథువేనియాలోని ఈ స్థలానికి సేవలను అందించడానికి ఒక రైల్వే లైన్‌ను విస్తరిస్తున్నారు. సైనికుల కుటుంబాల కోసం విల్నియస్, కౌనాస్ నగరాల్లో పాఠశాలలు, కిండర్‌గార్టెన్‌లను నిర్మిస్తున్నారు. మొత్తం బ్రిగేడ్ మోహరింపు 2027 చివరి నాటికి పూర్తవుతుందని అంచనా. ఇది రెండు దేశాలకు లాజిస్టికల్‌గా మాత్రమే కాకుండా, ఆర్థికంగా కూడా ఒక పెద్ద సవాలు. లిథువేనియా తన రక్షణ బడ్జెట్‌ను పెంచింది. ఛాన్సలర్ ఫ్రిడ్రిచ్ మెర్జ్ నేతృత్వంలోని కొత్త జర్మన్ ప్రభుత్వం కూడా రక్షణ ఖర్చులను పెంచే ప్రణాళికలను ప్రకటించింది. 4,800 మంది సైనికులను, 200 మంది ఉద్యోగులను లిథువేనియాకు స్వచ్ఛందంగా తరలించడం బుండెస్వెహర్‌కు ఒక సవాలుగా మారింది. దీనిని అధిగమించడానికి నాటో తూర్పు సరిహద్దులో 2024 జనవరిలో బుండెస్టాగ్ ఒక చట్టాన్ని ఆమోదించింది. ఇందులో సౌకర్యవంతమైన పని గంటలు, పెరిగిన అలవెన్సులు, ఓవర్‌టైమ్ చెల్లింపు వంటివి ఉన్నాయి. జర్మనీ 2017 నుండి లిథువేనియాలో మోహరించింది. అక్కడ NATO యుద్ధ సమూహానికి జర్మనీ నాయకత్వం వహించింది. బ్రిగేడ్ శాశ్వత మోహరింపుకు చట్టపరమైన ఆధారం 2024 సెప్టెంబర్‌లో జర్మనీ , లిథువేనియా మధ్య కుదిరిన అంతర్-ప్రభుత్వ ఒప్పందం. ఇది బుండెస్వెహర్‌కు లిథువేనియా ఆస్తులను అద్దె లేకుండా ఉపయోగించుకోవడానికి, దేశంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేయడానికి అనుమతిస్తుంది. ప్రభుత్వం జర్మన్ భాషా కిండర్‌గార్టెన్‌లు, పాఠశాలలను కూడా స్థాపించవచ్చు. ఇవి జర్మన్ పాఠ్యప్రణాళికను బోధిస్తాయి.

# భారత్‌తో మనుగడకే ప్రమాదం

### అందుకే అణ్వస్త్రాల ఆధునీకరణపై పాక్ దృష్టి

### అమెరికా రక్షణ నిఘా విభాగం నివేదిక వెల్లడి

ఇస్లామాబాద్: భారత్ వల్ల తన అస్తిత్వమే ప్రమాదంలో పడిందని పాకిస్తాన్ భయపడుతోంది.సైనికపరంగా పైచేయిగా ఉన్న భారత్‌ను నిలువరించేందుకు తనకున్న ఏకైక మార్గం అణ్వస్త్రాలే అని భావిస్తోంది. అందుకే, తన వద్ద ఉన్న అణ్వస్త్రాలను ఆధునీకరించుకునే పనిలో పడింది. ఇందుకోసం సైనిక, ఆర్థిక పరమైన సాయం అందిస్తోంది'..ఈ విషయాలు ఆదివారం అమెరికా రక్షణ నిఘా విభాగం(యూఎస్‌డీఐఏ) వరల్డ్ థ్రెట్ అసెస్‌మెంట్ పేరుతో విడుదల చేసిన నివేదికలో ఉన్నాయి.రాబోయే సంవత్సరాల్లో పొరుగు దేశాలతో సరిహద్దుల్లో ఘర్షణలను ఎదుర్కోవడం పాకిస్తాన్ మిలటరీ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని నివేదిక పేర్కొంది. ఇందులో భాగంగానే అణ్వస్త్రాల నవీకరణ కొనసాగించాలని నిర్ణయించుకుంది. ఈ ఆయుధ సంపత్తిని భద్రంగా కాపాడుకోవడం, కమాండ్ కంట్రోల్ వంటి వాటిపైనా పాక్ మిలటరీ దృష్టి పెట్టిందని తెలిపింది. సామూహిక జన హననాని(డబ్ల్యూఎండీ)కి అవసరమయ్యే ఆయుధ సామగ్రిని విదేశీ ఉత్పత్తి సంస్థలు, దళారుల ద్వారా సేకరించడం ఆర్మీ తప్పనిసరని భావిస్తోంది. డబ్ల్యూఎండీ తయారీ, అభివృద్ధిలో వాడే సామగ్రి, సాంకేతికతను ప్రధానంగా చైనా నుంచి పొందుతోంది. ఇందులో కొన్నిటిని హాంకాంగ్, సింగపూర్, తుర్కియే, యూఏఈల ద్వారా తెప్పించుకుంటోందని యూఎస్‌డీఐఏ నివేదిక తెలిపింది. 'పాక్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు చైనా కొనసాగుతున్నప్పటికీ, పాక్‌లో వివిధ ప్రాజెక్టుల కోసం పనిచేసే చైనీయులపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్న ఘటనలు రెండు దేశాలకు ఇబ్బందికరంగా మారాయి. రెండు మిత్ర దేశాల మధ్య ఇవి ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి'అని పేర్కొంది.

**నివేదికలో భారత్ గురించి ఏముంది?**



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా క్షిపణులను ప్రయోగించిన విషయాన్ని కూడా యూఎస్‌డీఐఏ తన నివేదికలో ప్రస్తావించింది. 'మే 7 నుంచి 10వ తేదీ వరకు క్షిపణి, డ్రోన్, ఆర్టిలరీ కాల్పులు చోటు చేసుకున్నాయి. 10వ తేదీన రెండు దేశాల సైన్యాలు పూర్తి స్థాయి కాల్పుల విరమణకు అంగీకరించాయి'అని పేర్కొంది. 'చైనా పలుకుబడికి చెక్ పెట్టేందుకు భారత్ కూడా వ్యూహాత్మకంగా హిందూ మహా సముద్ర తీర, ద్వీప దేశాలతో ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాలను పెంచుకుంటోంది'అని నివేదిక తెలిపింది. భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతల ప్రస్తావన సైతం ఇందులో ఉంది. 'తూర్పు లద్దాఖ్‌లోని వివాదాస్పద వాస్తవ్యాదీన రేఖ వెంబడి చిట్టచివరి రెండు ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి ఇరు దేశాలు సైన్యాలను ఉపసంహరించుకున్నప్పటికీ సరిహద్దు విభజన వివాదం అపరిష్కృతంగానే ఉండిపోయింది'అని పేర్కొంది. మిలటరీ ఆధునీకరణ, ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునే క్రమంలో దేశీయ రక్షణ పరిశ్రమను బలోపేతమయ్యేలా భారత్ 'మేడ్ ఇన్ ఇండియా'కార్యక్రమాన్ని కొనసాగించే అవకాశముంది.

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక www.saisuryaa.com
బుధవారం - 28 - మే - 2025

## గ్లింప్స్ అదుర్స్.. శేష్ 'డెకాయిట్' రిలీజ్ ఎప్పుడంటే?




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ యాక్షన్ డ్రామా డెకాయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఒక ప్రేమ కథ అనే ట్యాగ్ లైన్ తో రూపొందుతున్న ఆ సినిమాకు షానిల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తుండగా.. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. డెకాయిట్ కు అడివి శేష్ కథ, స్క్రీన్ ప్లే అందించగా, అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఎస్ ఎస్ క్రియేషన్స్, సునీల్ నారంగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో మంచి అంచనాలు నెలకొన్నాయి. కొద్ది రోజుల క్రితం రిలీజ్ అయిన టీజర్, లుక్స్ మూవీపై భారీ హోప్స్ ను క్రియేట్ చేశాయని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అయితే టీజర్ తర్వాత ఎలాంటి అప్డేట్ ఇవ్వని మేకర్స్.. రీసెంట్ గా గ్లింప్ ను రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. చెప్పినట్లు.. ఆదివారం ఉదయం రిలీజ్ చేశారు. సినిమా విడుదల తేదీని కూడా ప్రకటించారు. క్రిస్మస్ పండుగ కానుకగా డిసెంబర్ 25వ తేదీన సినిమాను రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. శేష్, మృణాల్ పోస్టర్ ను కూడా రివీల్ చేశారు. మృణాల్ ఎంట్రీతో గ్లింప్స్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత ఏ జూలియట్.. ఏం జరిగింది.. మామూలు విషయం కాదు.. నేను మోసం చేయడానికి రాలేదు.. అంటూ అడివి శేష్ వచ్చారు. అలా కంటిన్యూషన్ గా.. యాక్షన్ సీన్స్ ను యాడ్ చేశారు మేకర్స్. అవి గూస్ బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. గ్లింప్స్ కు స్పెషల్ గా అట్రాక్షన్ గా నిలిచాయి. అయితే గ్లింప్స్ లో శేష్ తన యాక్టింగ్ తో అదరగొట్టారు. యాక్షన్ సీక్వెన్స్ లో తన మార్క్ చూపించారు. మృణాల్ సీరియస్ లుక్ లో ఉన్నారు. మొత్తానికి గ్లింప్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. దీంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయని నెటిజన్లు చెబుతున్నారు. కాగా, ఇప్పటికే డెకాయిట్ మూవీ రిలీజ్ కు ముందే రికార్డులు క్రియేట్ చేస్తోందని టాక్. సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు వార్తలు వస్తున్నాయి. రూ.8 కోట్లకు ప్రముఖ సంస్థ సోనీ ఆడియో రైట్స్ ను సొంతం చేసుకుందని తెలుస్తుంది. శేష్ కెరీర్ లో అతి పెద్ద డీల్ అని సమాచారం. మరి మూవీ రిలీజ్ అయ్యాక ఎలాంటి హిట్ అవుతుందో అంతా వేచి చూడాలి.

# సినిమా చిత్రం

## కోలీవుడ్ లో 1000 కోట్లు అలా సాధ్యమే?



కోలీవుడ్ ఇండస్ట్రీకి ఇంతవరకూ 1000 కోట్ల వసూళ్ల చిత్రం ఒక్కటీ లేదు. సూపర్ స్టార్ రజనీకాంత్, దళపతి విజయ్, తల అజిత్, చియాన్ విక్రమ్, సూర్య, కార్తీ లాంటి స్టార్లు ఉన్నా? గొప్ప క్రియేటివ్ డైరెక్టర్లు ఉన్నా? 1000 కోట్ల క్లబ్ లో చేరింది లేదు. చివరికి కన్నడ పరిశ్రమ కూడా ఆ క్లబ్ లో చేరింది. ఇక టాలీవుడ్ పాన్ ఇండియా సంచలనాల గురించైతే చెప్పాల్సిన పనిలేదు. 1000 కోట్లు అన్నది తెలుగు పరిశ్రమకి జుజూబీ లాంటింది. దీంతో కోలీవుడ్ రేసులో ఎంతగా వెనుకబడి ఉందన్నది అర్దమవుతుంది. అలా కొంత కాలంగా కోలీవుడ్ కి 1000 కోట్లు అన్నది అందని ద్రాక్షగా మారింది. ఇంత కాలం అందని ద్రాక్ష ఇప్పుడు అందే అవకాశం ఉందా? అంటే అలా అనుకుని సంతృప్తి పడాల్సిందో అరవ పరిశ్రమ. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానా యకుడిగా తమిళ్ మేకర్ అట్లీ ఓ భారీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తుంది. సన్ నిర్మాణంలో ఇదే తొలి భారీ బడ్జెట్ గా రూపొందు తుంది. ఈ సినిమా మాత్రం 2000 కోట్ల వసూళ్ల టార్గెట్ గా బరిలోకి దిగుతుంది. ఇప్పటికే ఈ ఫీట్ ను బన్నీ పుష్ప సాధించి టాలీవుడ్ ని శిఖర స్థానానికి తీసుకెళ్లాడు. అట్లీ కూడా జవాన్ తో 1400 కోట్ల వసూళ్ల చిత్రం చేసాడు. కాకపోతే అది హిందీ లో కాబట్టి కోలీవుడ్ కి ఆ క్రెడిట్ దక్కదు. అలా కోలీవుడ్ అట్లీ ట్యాలెంట్ ను సరిగ్గా వాడుకోలేకపోయింది. బన్నీ చిత్రం హిట్ అయితే మాత్రం ఆ క్రెడిట్ సగమైనా దక్కుతుంది. హీరో తెలుగు వాడైనా? దాన్ని నిర్మిస్తుంది...దర్శకత్వం వహిస్తోంది అంతా కోలీవుడ్ కి చెందిన వారే కాబట్టి సక్సెస్ అయితే క్రెడిట్ లో షేర్ ఇవ్వొచ్చు. అదే చిత్రాన్ని అట్లీ కోలీవుడ్ హీరోతో తీసి 1000 కోట్ల చిత్రాన్ని చేయగల్గితే 100 శాతం క్రెడిట్ దక్కేది. కానీ ఆ ఛాన్స్ లేదు.

## రాజాసాబ్... ప్రభాస్‌కే ఎందుకు ఇలా జరుగుతుంది?



'బాహుబలి', 'సాహో', 'రాధేశ్యామ్' సినిమాల కోసం చాలా ఏళ్లు సమయం కేటాయించిన ప్రభాస్ తదుపరి సినిమాలను చాలా స్పీడ్‌గా చేయాలని అనుకున్నాడు. అందుకోసం బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు కమిట్ అయ్యాడు. ఏడాదికి రెండు, వీలుంటే మూడు సినిమాలను విడుదల చేయాలని ఆశ పడ్డాడు. అభిమా నులతో చాలా సార్లు ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తాను అంటూ హామీ ఇచ్చిన విషయం తెల్సిందే. కానీ దర్శకులు అందుకు సహకరించాలని అన్నాడు. అన్నట్లుగానే ఆయనకు దర్శకుల నుంచి సహకారం అందడం లేదు. రాజాసాబ్ సినిమా గత ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉన్నా ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఆ మధ్య 'రాజాసాబ్' సినిమాను ఏప్రిల్‌లో కచ్చితంగా విడుదల చేస్తామని మేకర్స్ బలంగా చెబుతూ వచ్చారు. కానీ సినిమా షూటింగ్‌తో పాటు, వీఎఫ్ఎక్స్ వర్క్ కూడా పూర్తి కాలేదు. దాంతో విడుదల వాయిదా వేయాల్సి వచ్చింది. ఏప్రిల్‌లో మిస్ అయినా సమ్మర్ చివరి వరకు సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని అంతా ఆశించారు. కానీ ఈ ఏడాది చివరికి సినిమాను వాయిదా వేశారనే వార్తలు వస్తున్నాయి. సినీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం 2025 డిసెంబర్‌కి సినిమాను విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సినిమాకు ఆర్థిక ఇబ్బందులు అంటూ పుకార్లు షికార్లు చేశాయి. కానీ సినిమా యొక్క వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి కానందున సినిమా వాయిదా పడ్డట్లు తెలుస్తోంది. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడానికి చాలా సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ లోపు ప్రభాస్ నటిస్తున్న మరో సినిమా ఫౌజీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. సీతారామం దర్శకుడు హను రాఘవ పూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమాను స్పీడ్‌గా షూటింగ్ చేస్తున్నారు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే సినిమా ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాజాసాబ్ సినిమా మాత్రం 2025 డిసెంబర్‌లో కూడా వచ్చే వరకు అనుమానమే అంటూ కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సినిమాకు ఉన్న బజ్‌ను కాపాడుకుంటూ అనుకున్న సమయంకు విడుదల చేసి ఉంటే కచ్చితంగా రాజాసాబ్ సినిమా ఫలితం మరో రేంజ్‌లో ఉండేది అనేది ఇండస్ట్రీ వర్గాల టాక్. పాపం ప్రభాస్ ఏడాదికి రెండు మూడు సినిమాలు చేయాలని ఎంతగా ప్రయత్నాలు చేసినా, ప్రేక్షకుల ముందుకు ఏడాదికి రెండు మూడు సినిమాలను తీసుకు రావాలని భావించినా కూడా సాధ్యం కావడం లేదు.

ఇతర హీరోలు మెల్లగా సినిమాలు చేస్తూ ఏడాదికి ఒకటి లేదా రెండేళ్లకు ఒకటి సినిమాను చేస్తున్నారు. కానీ ప్రభాస్ మాత్రం ఒకే సారి రెండు మూడు సినిమాలు చేస్తున్నా కూడా ఏదో ఒక సమస్య కారణంగా ఆలస్యం అవుతోంది. సలార్ 2, కల్కి 2 సినిమాలు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. రాజాసాబ్ సినిమా తో పాటు ఫౌజీ సినిమా ఈ ఏడాదిలో వస్తుందని అభిమానులు ఎదురు చూస్తు న్నారు. కానీ అది సాధ్యం అయ్యేలా కనిపిం చడం లేదు.

దాంతో ప్రభాస్‌కే ఎందుకు ఇలా జరుగుతుందని అభి మా నులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఇస్మార్ట్ బ్యూటీ అందాల షో

'నన్ను దోచుకుందువటే' సినిమాతో తెలుగులో 2018లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. ఈ కన్నడ బ్యూటీ 2015లో వజ్రకాయ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన విషయం తెల్సిందే. ఆ సినిమాతో కన్నడంలో మంచి గుర్తింపు దక్కించుకుంది. వజ్రకాయ తర్వాత తెలుగులో ఈ అమ్మడు లీ, సాహెబా సినిమాలు చేసింది. ఆ సినిమాలు





నభాకు పాజిటివ్ రెస్పాన్స్‌ను తెచ్చి పెట్టాయి. 'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కించుకున్న నభా నటేష్ ఆ తర్వాత అదుగో సినిమాలో నటించింది. ఈ అమ్మడికి లక్కీగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఇస్మార్ట్ శంకర్‌లో ఈమె పోషించిన మాస్ పాత్రకు మంచి మార్కులు దక్కాయి. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో నభా నటేష్‌కి ఇస్మార్ట్ బ్యూటీ అనే పేరు దక్కింది. ఆ సినిమా సూపర్ హిట్ అయినా ఆ వెంటనే కరోనా కారణంగా నభా నటేష్‌కి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. ఇస్మార్ట్ క్రేజ్‌ను నభా నటేష్ పెద్దగా సద్వినియోగం చేసుకోలేక పోయింది. గత ఏడాది డార్లింగ్ అనే వెబ్ మూవీలో నటించడం ద్వారా మరోసారి తన నటన ప్రతిభ కనబర్చింది. అయినా కూడా ఆశించిన స్థాయిలో ఆఫర్లు మాత్రం ఈ అమ్మడు దక్కించుకోవడంలో విఫలం అవుతుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు, వీడియోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ అమ్మడికి ఏకంగా 5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. రెగ్యులర్‌గా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసే అందాల ఆరబోత ఫోటోలకు మంచి రీచ్ దక్కుతూ ఉంటుంది. ఫోటోలు షేర్ చేసిన వెంటనే వేలాది మంది అభిమానులు, ఫాలోవర్స్ లైక్ చేయడంతో పాటు, కామెంట్ చేస్తూ ఉంటారు. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలకు సోషల్ మీడియాలో పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. ఇస్మార్ట్ బ్యూటీ అందాల షోకి చూపు తిప్పుకోలేక పోతున్నాం అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. వైట్ టాప్‌లో నడుము అందం చూపిస్తూ కవ్విస్తున్న ఇస్మార్ట్ బ్యూటీ కవ్వింపులకు అంతా ఫిదా అవుతున్నారు. స్కిన్ షో తో హొయలు పోతున్న ఈ అమ్మడు మరోసారి అందం తో మతి పోగొడుతోంది. ఇంత అందంగా ఉన్న నభా నటేష్‌కి ఇండస్ట్రీలో ఎందుకు ఆఫర్లు రావడం లేదు అంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తూ తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఆ మధ్య ఒక తమిళ సినిమాలో నటించబోతుంది అనే వార్తలు వచ్చాయి. కానీ చివరకు ఆ సినిమాలో ఈమెను తీసుకోకుండానే షూటింగ్ ప్రారంభించారట. తమిళ్‌లోనే



కాకుండా ఈమె తెలుగు, కన్నడ సినిమాలో కూడా ఆఫర్లు వస్తాయని ఆశించింది. కానీ ఆఫర్ల విషయంలో ఆమెకు ఎప్పుడూ నిరాశే మిగిలింది.

టాలీవుడ్‌లో చేసిన ప్రతి సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకున్నా కూడా లక్ కలిసి రాకపోవడంతో ఇక్కడ స్టార్‌డం దక్కలేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా పదేళ్లు అవుతున్నా కూడా ఇప్పటి వరకు సరైన బ్రేక్ రాకపోవడంతో ఎదురు చూస్తున్న ఈఅమ్మడు ముందు ముందు అయినా టాలీవుడ్‌తో పాటు, ఇతర సౌత్ భాషల్లో బిజీ అయ్యేనా చూడాలి.

## తమ్ముడు సీన్ లోకి వచ్చి అన్నయ్యని టెన్షన్ పెడుతున్నాడా?

ఎప్పుడొచ్చాం కాదన్నయ్యా... బుల్లెట్ దిగిందా? లేదా? అన్నది ఇంపార్టెంట్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇప్పుడు అదే తీరున కనిపిస్తున్నారు. ఆలస్యమైెంత కాలం అతడి సినిమాలు సంవత్సరాల పాటు సాగాయి. కానీ పనిగట్టుకుని ఆయన రంగలోకి దిగితే సీన్ ఎలా ఉంటుందో చూపిస్తున్నారు. ఇప్పటికే 'హరిహర వీరమల్లు' షూటింగ్ పూర్తయింది. జూన్ 12న ఆ సినిమా రిలీజ్ అయిపోతుంది. - ఓజీ - షూటింగ్ కూడా షురూ చేసారు. ఆయన సెట్స్ కు వెళ్లడం ఇలా మొదలైందో? లేదో? సెప్టెంబర్ 25న రిలీజ్ అంటూ ప్రకటన వచ్చేసింది. ఆ తేదీకి రిలీజ్ తప్పనిసరి అని యూనిట్ స్ట్రాంగ్ గా చెబుతుంది. ఈ రెండు సినిమాలు భారీ విజయం సాధిస్తాయి? అన్న నమ్మ కం బలంగా ఉంది అలాగే 'ఉస్తాద్ భగత్ సింగ్' ను కూడా రెడీగా ఉండమన్నాడు పవన్ . 'ఓజీ' ముగించిన అనంతరం ఉస్తాద్ ని పట్టాలెక్కిస్తారు. ఇలా ఒక్కసారిగా పీకే సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయిపోయారు. ఈ క్రమంలో చిరంజీవి 'విశ్వంభర' రిలీజ్ ఎప్పుడు? అంటూ పవన్ సినిమాలతో ముడి పెట్టి మాట్లాడటం నెట్టింట మొదలైంది. తమ్ముడు అంటే రాజకీయాల్లో బిజీగా ఉన్నాడు కాబట్టి సినిమాల విషయంలో డిలే జరిగింది. మరి అన్న య్య సినిమా ల్లోనే బిజీగా ఉండి? ఎందుకు 'విశ్వంభర' రిలీజ్ చేయలేకపోతున్నారు? అన్న వాదన తెరపైకి వచ్చింది. జనవరిలో రిలీజ్ అవ్వాల్సిన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ డిలే కారణంగా ఆలస్యమైనా? మరీ ఐదు నెలలు గడిచే వరకూనా? చివరికి చిరంజీవి 157వ సినిమా కూడా పట్టాలెక్కింది. మరి 'విశ్వంభర' ఉంటుందా? ఉండదా? అంటూ కౌంటర్ ఎటాక్ మొదలైంది. ఇంత వరకూ కొత్త రిలీజ్ తేదీని 'విశ్వంభర' టీమ్ ప్రకటించక పోవడంతోనే ఒత్తిడి మొద లైంది. సెప్టెంబర్ ..అక్టోబర్ అంటూ రిలీజ్ విషయంలో ప్రచారం జరుగు తున్నా? అంత వరకూ అంటే అభిమా నులు శాంతించేలా కనిపించలేదు. జూన్ మిస్ అయినా జూలైలో నైనా రిలీజ్ ఉంటుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. ఆ మాసం కూడా మిస్ అయితే మరింత ఒత్తిడి తప్పదని ఫిలిం సర్కిల్స్ లో చర్చకు దారి తీసింది.



## చెంగారెడ్డిని చూసి అసూయ పడిన విశ్వనటుడు!

లోకనాయకుడు కమల్‌హసన్, దిగ్గజ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో 38 ఏళ్ల క్రితం వచ్చిన నాయకన్ సినిమా అప్పట్లో ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఈ బ్లాక్‌బస్టర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన భారీ బడ్జెట్ సినిమా థగ్ లైఫ్. వచ్చే నెల 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రిలీజ్ అవుతుండడం తెలిసిందే. రిలీజ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ లో భాగంగా ఆదివారం చెన్నైలో చిత్ర ఆడియో లాంచ్ను నిర్వహించింది. ఈ ఆడియో ఫంక్షన్‌లో కమల్‌హాసన్, జోజూ జార్జ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తనకు ఇరట్ట సినిమాకు ముందు వరకు జోజూ జార్జ్ గురించి పెద్దగా తెలియదని, ఆ మూవీ చూశాక అతడి నటన చూసి ఆశ్చర్యపోయానని చెప్పాడు. ఆ సినిమాలో జోజూ ఎప్పటికి గుర్తుండి పోయే పాత్ర పోషించారని ప్రశం సించాడు. కొందరి నటన చూసి తాను అసూయపడే వారిలో జోజూ కూడా ఒకరని అన్నారు. జోజుకి మంచి భవిష్యత్ ఉందని ఆకాంక్షించాడు. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరికి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరో హించే శక్తి సామర్థ్యాలు ఉన్నాయని కొనియాడాడు. సినిమా అనే దానికి తానొక వీరాభిమాని అని.. అదే సినిమా తనని, మణిరత్నంను మరోసారి దగ్గర చేసిందని కమల్‌హాసన్ తెలిపాడు. నాయకన్ కంటే థగ్ లైఫ్ చిత్రం పెద్ద హిట్ అవుతుందని చెప్పాడు. ఇక థగ్ లైఫ్ మూవీ గురించి మాట్లాడాలంటే ముందు ఏఆర్ రెహమాన్ గురించి చెప్పాల్సిందే అన్నాడు. సంగీతంలో ఇళయరాజా తర్వాత తనను ఆస్థాయిలో ఆకట్టుకుంది రెహమాన్ అని ఆకాశానికెత్తాడు. వీరిద్దరూ తమ సంగీతంతో దక్షిణ భారతదేశం గర్వించేలా చేశారని ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ సినిమాలో హీరో శింబు, త్రిషా అద్భుతమైన పాత్రలు పోషించారని అన్నాడు. శింబు భవిష్యత్‌లో ఇతరులకు మార్గదర్శనం చేసే ఒక నాయకుడిగా ఎదుగుతాడని కమల్ జోస్యం చెప్పాడు. త్రిష చూడ్డానికి మాత్రమే అందగత్తె కాదని, ఆమె మనకు కూడా చాలా గొప్పదని పొగడ్తలు కురిపించాడు. మరో నటి అభిరామి కూడా ఈ సినిమాలో బలమైన పాత్ర పోషించారని తెలిపాడు. శ్రేష్ఠ మూవీస్ ద్వారా ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్న ఈ సినిమా విజయంపై కమల్ హాసన్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు.



## తమ్ముడు సీన్ లోకి వచ్చి అన్నయ్యని టెన్షన్ పెడుతున్నాడా?

ఎప్పుడొచ్చాం కాదన్నయ్యా...బుల్లెట్ దిగిందా? లేదా? అన్నది ఇంపార్టెంట్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇప్పుడు అదే తీరున కనిపిస్తున్నారు. ఆలస్యమైెంత కాలం అతడి సినిమాలు సంవత్సరాల పాటు సాగాయి. కానీ పనిగట్టుకుని ఆయన రంగలోకి దిగితే సీన్ ఎలా ఉంటుందో చూపిస్తున్నారు. ఇప్పటికే 'హరిహర వీరమల్లు' షూటింగ్ పూర్తయింది. జూన్ 12న ఆ సినిమా రిలీజ్ అయిపోతుంది. - ఓజీ - షూటింగ్ కూడా షురూ చేసారు. ఆయన సెట్స్ కు వెళ్లడం ఇలా మొదలైందో? లేదో? సెప్టెంబర్ 25న రిలీజ్ అంటూ ప్రకటన వచ్చేసింది. ఆ తేదీకి రిలీజ్ తప్పనిసరి అని యూనిట్ స్ట్రాంగ్ గా చెబుతుంది. ఈ రెండు సినిమాలు భారీ విజయం సాధిస్తాయి? అన్న నమ్మ కం బలంగా ఉంది అలాగే 'ఉస్తాద్ భగత్ సింగ్' ను కూడా రెడీగా ఉండమన్నాడు పవన్ . 'ఓజీ' ముగించిన అనంతరం ఉస్తాద్ ని పట్టాలెక్కిస్తారు. ఇలా ఒక్కసారిగా పీకే సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయిపోయారు. ఈ క్రమంలో చిరంజీవి 'విశ్వంభర' రిలీజ్ ఎప్పుడు? అంటూ పవన్ సినిమాలతో ముడి పెట్టి మాట్లాడటం నెట్టింట మొదలైంది. తమ్ముడు అంటే రాజకీయాల్లో బిజీగా ఉన్నాడు కాబట్టి సినిమాల విషయంలో డిలే జరిగింది. మరి అన్న య్య సినిమా ల్లోనే బిజీగా ఉండి? ఎందుకు 'విశ్వంభర' రిలీజ్ చేయలేకపోతున్నారు? అన్న వాదన తెరపైకి వచ్చింది. జనవరిలో రిలీజ్ అవ్వాల్సిన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ డిలే కారణంగా ఆలస్యమైనా? మరీ ఐదు నెలలు గడిచే వరకూనా? చివరికి చిరంజీవి 157వ సినిమా కూడా పట్టాలెక్కింది. మరి 'విశ్వంభర' ఉంటుందా? ఉండదా? అంటూ కౌంటర్ ఎటాక్ మొదలైంది. ఇంత వరకూ కొత్త రిలీజ్ తేదీని 'విశ్వంభర' టీమ్ ప్రకటించక పోవడంతోనే ఒత్తిడి మొదలైంది. సెప్టెంబర్ ..అక్టోబర్ అంటూ రిలీజ్ విషయంలో ప్రచారం జరుగు తున్నా? అంత వరకూ అంటే అభిమానులు శాంతించేలా కనిపించలేదు. జూన్ మిస్ అయినా జూలైలో నైనా రిలీజ్ ఉంటుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. ఆ మాసం కూడా మిస్ అయితే మరింత ఒత్తిడి తప్పదని ఫిలిం సర్కిల్స్ లో చర్చకు దారి తీసింది.



Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.saisuryaadaily @gmail.com